# స్వప్నభంగం

వసంతం, మామిడి చిగుళ్ళు నములుతున్న పుంస్కోకిలాలాపం - కొలనుల్లో శతధా సహస్రధా వికసించిన కమలాల పరిమళాలతోబాటు విజృంభించిన భంభరాల ప్రణయ ప్రణవ సంగీత నిక్వణాలు.

చిరుగాలి సవ్వడితో సంస్పర్శతో పులకరించిన సంపెంగల సన్న జాజుల రేకుల తాకిడితో సుతారంగా అతిమెత్తగా మారి ప్రవహించే ప్రసరించే ఉషస్సుషమాకాంతిరేఖలు.

తెల్లదనంతో వెల్లవేసినట్లున్న ఆకాశపు పెండ్లి పందిట్లో ముత్యాల చాందినీలో, వ్రేలాడుతున్న మబ్బుతునకలు, కామరూపధారణలో దశదిశాభిముఖంగా స్వయంవరానికై పయనిస్తున్న రాజకుమారుల మాదిరి మంద మందంగా సుందరంగా నడక.

భూదేవి ధరించిన చిలకపచ్చ చీరెమీద అల్లిన జరీ పోగుల్లాగా, ఆకుపచ్చని చెట్లతో గరికెతో నిండిన వనాలమధ్య పొలాలనడుమ విరబూచిన కలువలూ, మందారాలూ.

శ్రీనాథుడు రసజగత్తులో లీనమైపోయాడు. అతనికి చుట్టూ తోట కనిపించడంలేదు, తోటల నడుమ దొరువులూ, దొరువుల్లో పరుచుకున్న తామరాకులూ, తామరాకులమీద ముత్యాల్లా దొర్లే నీటిబొట్లూ, నీటి బొట్లనుండి లేచిన సన్నని తుంపురుల జల్లులు, జల్లులతో తడిసిన గాలి, గాలితో నిండిన వెలుగు, వెలుగుల రేకులతో వికసించిన పూలు, ఉషస్సే శబ్దంగా రూపంగా రసంగా గంధంగా మారి స్పృశిస్తున్నది.

భూమ్యాకాశాల మధ్య అభేదత్వాన్ని సాధిస్తున్నది.

నల్లని రాత్రినీ ఎర్రటి పగటినీ కలిపి తన తెల్లటి వెండిపోగుతో కలిపి కుడుతున్నది.

శ్రీనాథుడు నిలువెత్తు మనిషీ కరిగిపోయాడు. తానే రసవాహినిగా మారి పోయాడు. మరంద ప్రవాహంగా జారిపోయాడు. అతని శరీరంపైపులకలు కలువ మొగ్గల్లా లేచాయి. అతని కళ్ళవెంట తన్మయబాష్పాలు రసస్రవంతుల్లా జాలు వారాయి అతని భావాలు అలలు అలలుగా, కెరటాలు కెరటాలుగా, తరం గాలు తరంగాలుగా అనుక్రమంతో పుంఖాను పుంఖంగా విజృంభిస్తున్నాయి.

గద్గదమైన అతని గొంతు సన్నగా శ్రుతి చేయబడింది. మెట్లుమెట్లుగా పలికించబడింది.

రాగ కదంబకం వెలువడింది :

"రంగవల్లుల నద్దుకొని ఉద

యాంగణము మాంజిష్టకాంతుల

తరుణ కిరణారుణములను తో

రణ సమూహముతోడ నిలిచెను

ఇది ఉషస్సుకు కాంతి మూర్తికి

ఉదయ సుముహూర్తమ్ము లోపల

ఎదలు కలిసిన గాథనేను ని

వేదనము చేసెదను జగతికి."

శ్రీనాథుడు పాడుతున్నాడు.

పాటలే కవిత్వ లతలుగా పాకుతున్నాయి - పాకిన ప్రతి లత చివరా గుత్తులు గుత్తులుగా శబ్దాల పూలు, కవిత్వపు గెలలు.

గెల గెల నుంచి ఆ తొణికే కవితా రసప్రసాదం ప్రవాహం-అతనికింక లౌకిక జగత్తూ అందులోని మంగతాయారూ ఎక్కడ జ్ఞాపకముంటుంది??

* * *

ఇంట్లో నెయ్యి నిండుకున్నది. రాత్రి శ్రీనాథుడితో ఒకటికి రెండుసార్లు చెప్పింది. 'మరచిపోకండి - పొద్దున్నే ఆ తోటలోకి పోయి కూర్చొని పగటి కలలు కనడం మొదలెట్టకండి. ముందు ఓ కిలో నెయ్యి తెచ్చిచ్చి మరీ వెళ్ళండి.'

తెల్లవారింది.

శ్రీనాథుడు తోటలోకి వెళ్ళాడు.

ఉషస్సును చూస్తున్నాడు.

ఉషస్సును తాగుతున్నాడు.

ఉషస్సును తనలో నింపుకొని తాను ఉషస్సుతో నిండిపోయాడు.

తెల్లని పాలవంటి ఉషస్సు కాగి ఎరుపు రంగుకు తిరగడానికి కొన్ని గంటలు పట్టింది. పొద్దు కరకర పైకి వచ్చింది.

వాకిట్లోకి ఎందుకనో కూరలు రాలేదు. చింతచిగురు మాత్రం వచ్చింది. కొన్ని పప్పులో వేసింది. వంకాయో బీరకాయో వస్తుందేమోనని చాలాసేపు ఎదురు చూసింది. రాలేదు. తాయారుకు చిరాకు ఎక్కువైంది.

ఆ రోజు శనివారం -

తాను వెంకటేశ్వరస్వామివారి పూజకూడా చేసుకోవాలి. కొబ్బరికాయ తెప్పించాలి. ఎలా ??

'ఈయన పిట్టలదొరలాగా ఏ తోటల్లో తిరుగుతున్నాడో' అనుకుంది మంగతాయారు.

పిట్టలదొరంటే లోకంలో వున్న అర్థమేమిటో ఆమెకు తెలియదు కాని తన భర్త మాత్రం నిజంగా పిట్టలదొరే !

తాను నడిస్తే "ఓహో ! నా ఇంటి కొలనులో హంస తిరుగుతున్నదే" అంటాడు. కోపం వస్తే 'గువ్వలా ముడుచుకున్నావేం' అంటాడు. ఆకాశంలో చుక్కలు వస్తే 'పురి విప్పుకున్న ముత్యాల చుక్కల కన్నులతో నీలి ఆకాశంలో నెమలిలా పరుచుకొని వర్తిస్తున్నది' అంటాడు. తాను ఏదైనా మాట్లాడితే కోయిల కూస్తున్నదంటాడు.

పెళ్ళైన కొత్తల్లో ఇవన్నీ తాయారుకు తమాషాగానే వుండేవి కాని క్రమంగా ఆమెకు విసుగు బయలుదేరింది.

జీవితాన్ని జీవితంగా చూడటమే ఆమెకు తెలుసు కాని కవిత్వాలూ అలంకారాలూ జీవితంలో రంగరించటం ఆమెకు గిట్టలేదు.

స్నానంచేసి వెంకటేశ్వరస్వామి పటంముందు కూర్చున్నది. అక్షతలను పసుపువేసి కలిపింది. కాని మనస్సు మాత్రం స్వామి పాదాలమీద నిలవడం లేదు.

పెందలాడే రమ్మనిచెప్తే ఇంతవరకూ ఈయన ఇంటి ముఖం చూడలేదు.

ఏం చేయాలి తాను ?

పూలూ తులసీదళాలూ వేసి స్వామివారిని పూజించింది. కర్పూర నీరాజనాన్ని తిసుకున్నది. అవసర నైవేద్యంగా కాస్త కలకండ తీసుకున్నది.

ఇంతలో వచ్చాడు శ్రీనాథుడు.

వస్తూనే ఆమెకు కొబ్బరికాయ అందించాడు. కూరల సంచిని వంట ఇంట్లో పడేశాడు.

తాయారు కాయ కొట్టింది. హారతి నిచ్చింది. నైవేద్యం పెట్టి పూజ ముగించింది.

భర్తతో పోట్లాడాలని పూజ మరి కొంచెం త్వరగా ముగించింది.

"ఏమండీ ఎక్కడికి వెళ్ళారు ?"

"ఉషస్సు దగ్గరికి."

తాయారుకు బాగా కోపం వచ్చింది.

"అయితే దాని దగ్గరే కూర్చోకపోయారా ? మళ్ళీ సంసారమెందుకు??.... నెయ్యి తెమ్మని రాత్రనంగా చెప్పాను - తెచ్చారా ?"

'ఆఁ -"

"ఇప్పుడా తెచ్చేది - ఇంత ఆలస్యంగా."

"తాయారూ ! భోజనం చేసేది పన్నెండు గంటలకు, ఇప్పుడింకా పది కొట్టలేదు - ఎందుకంత హడావుడి."

"ఇంట్లో ఒక్క కూరలేదు."

"అవిగో నాలుగు కూరలు తెచ్చాను. బచ్చలి కూర పప్పులో వెయ్యి, వంకాయ కొబ్బరి పెట్టి వండు, కాకరకాయ వెల్లుల్లికారం పెట్టు ములక్కాయ సాంబారుకాయి."

"ఇవ్వాళ శనివారం వెల్లుల్లి కూడదు."

"అయితే ఏంపోయె - పులుసూ బెల్లం పెట్టి వండు."

తాయారుకు దెబ్బలాడడానికి కారణమేమీ దొరకడంలేదు.

"పూజకు కొబ్బరికాయ లేనేలేదు."

"సమయానికి వచ్చింది కదా !"

"వస్తుందని నాకేం తెలుసు - కంగారు పడ్డాను."

"నీకు తెలియకున్నా నాకు తెలుసు కదా నీవు పది గంటలకు పూజ చేసుకుంటావని."

"అవును మరి మీరు చేయకపోతే నేనైనా చేయవద్దా '

'వెర్రిమొఖమా ! శబ్దబ్రహ్మను ఉపాసించే నాకీ సాకారమైన శిలామూర్తుల పూజతో ఇంకా పనేమిటే !'

భర్త అన్నది తాయారుకు అర్థమైందో కాలేదో చెప్పడం కష్టమే అయినా అయనేదో నాస్తికునిలా మాట్లాడుతున్నాడని మాత్రం ఎందుకో అనిపించింది.

'ఇదిగో చూడండి - మీరు ఏ వస్తువులు ఎప్పుడు తెచ్చారన్నది ముఖ్యం కాదు. దృష్టిని తోటలమీదా దొడ్లమీదా ఉంచకుండా ఇల్లు గూర్చి ఇల్లాలుగూర్చి ఆలోచించాలనే నా ఉద్దేశం.'

'అలాగే - నేనెమీ కవిత పేర వాస్తవ జగత్తు నుండి పలాయన వాదాన్ని చిత్రగించడం లేదు. కానీ తాయారూ ఒక్కటి చెప్పు - ఈ మానవు లెంత మూర్ఖులో ఆలోచించు. ఉదయం ఉషస్సు వారి కోసం వెండి వెలుగులతో సాక్షాత్కరిసుంది. సాయంత్రం సంధ్య మళ్ళీ కుంకుమపొడిని దోసిళ్ళతో వెద జల్లుతూ వుంటుంది. అయితే వీరికి ఉషస్సు అక్కర్లేదు. ఇది చూచి ఆనందించే శక్తి ఆసక్తి వీరికి లేదు. సూర్యుడు సప్తాశ్వాలతో మన కోసం ఎంతో దూరం నుండి పరుగెత్తుకొని వస్తూంటే వాళ్ళు కాలువగట్టున చెంబులు పట్టుకొని పడమటి దిక్కుగా ముఖాలు పెట్టుకు నడుస్తారు. తాయారూ....నెనూ అలా చేయడం నీ కిష్టమా ? ? ఈ ప్రకృతిని నా మనస్సులో ముద్ర వేసుకొని, దాన్ని శబ్దాలలో అచ్చులచ్చులుగా కలకండ పోతపోసి సమాజానికివ్వడం తప్పంటావా ? ఏం చెప్పు -"

తాయారు కూర తరుగుతూ మధ్య మధ్య భర్త ముఖం చూస్తూ వింటున్నది.

'పిచ్చిదానా - దేవుడు మనకోసం ప్రకృతినే వరంగా ప్రసాదించాడు. ఉదయం ఒక రంగుల తెర - సాయంత్రం ఒక రంగుల వల - రాత్రి మొత్తం వెన్నెల పాలనదులు - ముంగిట్లో ఉన్న ఈ ఐశ్వర్యాన్ని అనుభవించడం చేత కానివాడికి అజంతాలెందుకు? ఎల్లోరాలెందుకు? హిమాలయాలూ మహిమాలయాలూ వాడి తాపాన్ని తీర్చలేవు - గుర్తుంచుకో' కొంతసేపైన తరువాత శ్రీనాథుడి ఆవేశం తగ్గుతుంది - ఆపైన తన పనిలోకి పోతాడు.

తాయారుకిది తెలుసు. అందుకే మాట్లాడకుండా ఊరుకున్నది.

శ్రీనాథుడు లోనికి వెళ్ళాడు.

స్నాన సంధ్యాది విధుల్లో మునిగిపోయాడు.

తన భర్త ఇంటిపనులు నిర్లక్ష్యం చేయడంలేదని తనకు తెలుసు.

నిజమే!

కాని తాను కోరుకుంటున్నది కేవలం ఆయన ఇంటిపనులు చేస్తూ వుండడమేనా?

ఇంతకన్నా ఇంక ఎక్కువ ఏమీవద్దా?

తనకూ తోటి స్త్రీలలా ఎన్నో కోరికలూ వాటి సాఫల్యానికై పథకాలూ వుండవా??

వాటినన్నిటినీ తీర్చేందుకు నెమళ్ళనూ పాలపిట్టలనూ చూస్తూ మురిసిపోయే తన భర్త ఎలా నెరవేర్చగలడు??....

రోజూ వంటచేస్తూ ఇలాగే తాయారు ఆలోచిస్తుంది - ఇవ్వాళకూడా అలాగే ఆలోచించింది. ఆలోచిస్తూనే వంట ముగించింది.

వంట ముగించి మళ్ళీ ఆలోచించింది.

భర్తకు కవిత, ప్రకృతి ఎంత కళాత్మకంగా వుండాలో నిత్య జీవితం కూడా అలాగే వుండాలి.

వంటలో ఏ చిన్న లోపం కనపడ్డా వెంటనే ఆక్షేపిస్తాడు.

శ్రీనాథుడు భోజనానికి కూర్చున్నాడు.

తాయారు లేత అరిటాకు వేసింది.

పొడిపొడిగావున్న నెల్లూరు మొలకొలుకుల బియ్యపు అన్నం పెట్టింది.

చింతచిగురు పప్పు, వంకాయ కొబ్బరివేసిన కూరా, ముద్దపప్పు వడ్డిం

చింది. స్టీలు గిన్నెలో మోరుకొళంబూ,మరో గిన్నెలో మునక్కాడల సాంబారూ పెట్టింది.

పక్కనే వేరే రెండు పళ్ళాలలో మామిడిపండ్ల ముక్కలూ, అప్పడాలూ, వడియాలూ.

శ్రీనాథుడు పరిషేచనచేసి భోజనానికుపక్రమించాడు. కర్పూరంలా ఘుమఘుమలాడే ఆవునేతిని చేతిపైకి వేసింది. శ్రీనాథుడు రెండుముద్దలు తిని అన్నాడు 'తయారు - వంకాయకూరలో లేత కరివేపాకు ఎందుకు వెయ్యలేదు?,

'వేశానే ...'

'ఏమిటి వేశావు నా ముఖం - చూడు ఆకు కొంచెం ముదిరింది - లేత ఆకయితే కూరతోబాటు కరిగిపోవాలి - దాని పరిమళం మొత్తం కూరకు పట్టాలి, తెలిసిందా.'

"తెలిసింది - కాని పతిదేవా! లేత ఆకుకు మీరు చెప్పినంత సుగంధం వుండదు."

శ్రీనాథుడు నవ్వి 'చూడు యోజనగంధీ! నీ కరస్పర్శతో ఆకులేమిటి, రాళ్ళు రప్పలూ కూడా చందన తరువుల్లా మారిపోయి మైళ్ళ పొడుగున సుగంధాన్ని విరజిమ్ముతాయి. నాకు తెలుసు' అన్నాడు.

తాయారు ఏమీ మాట్లాడలేదు

ఆమెకీ పైత్యం కొత్తకాదు. పెళ్ళయిన నాటినుండీ చూస్తున్న ముచ్చటే!

"చూడు- చింతచిగురు పప్పులో కాడలు ఎక్కువగా వున్నాయేమిటి"

"తొందరలో ఏరలేదు."

"ఎందుకంత తొందర- చూడు తాయారు మీ నాన్నగారు రామానుజ స్వామిగారు ప్రవృత్తి యోగంలో పెద్ద పండితులు- అసలు జీవితమంటే ఏమిటి? కళ అంటే ఏమిటి?? కళా, కాకరకాయా, అని తెలుగువాళ్ళు సామెతగా వెక్కిరిస్తారు కాని నిజంగా కళ అనేది ఆకాశంనుంచి వూడిపడదు - కాకరకాయ దగ్గరినుండే ప్రారంభమవుతుంది - చేదు కాకరకాయను పొట్టకోసి వెల్లుల్లి కారం పెట్టి వేయించి ఘుమఘుమలాడేటట్లు చేసి స్వాదుష్టంగా మార్చి తినడం కళ కదా? చక్రాలుగా తరిగి ఎత్తుకెత్తు ఉల్లిపాయలు సన్నగా తరిగి కలిపి ఎర్రడాలుగా, అంత చేదు లేకుండా అంత మాడిపోకుండా సన్నని సెగమీద సుతారంగా

వేయించి తినడం కళ కాదా ? చతుష్షష్టి కళల్లో ఇదొక మహోన్నత కళ. కళంటే ఏమిటి తాయారూ, మతమంటే ఏమిటి ? చింతచిగురు కాడలు నువ్వు సరిగ్గా ఏరకపోవడం నివృత్తి - సరిగ్గా ఏరడం పేరే ప్రవృత్తి - "సక్రమంగా చిలుము గొట్టం నింపగలిగినవాడు బ్రహ్మ విద్యను కూడా సక్రమముగానే అభ్యసించ గలుగుతాడు" అన్నారు స్వామి వివేకానందులు. శ్రీనాథుని ప్రసంగంలో వివేకా నందుడూ, అరవిందుడూ, రామకృష్ణుడూ, రామతీర్థులూ అలా నిరంతరం విహ రిస్తూ వుంటారు - ప్రతి మాటకూ ఒక ఉదాహరణ. ఒక కొటేషను -

"మోర్ కొళంబు వేసుకోలేదు."

"మోర్ కొళంబు చిక్కగా పసుపువచ్చగా వుండాలి. ఇది తెల్లగా బద్దలుబద్దలుగా విరిగింది. అందుకని వేసుకోలేదు."

"అయినా రుచి బాగానే వుంటుందండీ -"

"నీవేం శబరివా. బాగా వుంటుందని నీకు ముందే ఎలా తెలుసు ? ఒక వేళ నోటికి బాగున్నా, కంటికి బాగుండనక్కరలేదా ? కంటికీ నోటికీ చెవికి కాదు హృదయానికీ ఆత్మకూ కూడా నచ్చాలి ఏ విషయమైనా సరే -"

పెరుగు వేసుకొని అందులో మామిడి ముక్కలు నంజుకుంటూ భోంచే స్తున్నాడు శ్రీనాథుడు.

తాయారు భర్తను చూస్తూ అలా ఎదురుగా కూర్చున్నది నిశ్శబ్దంగా.

"తాయారూ తెల్లని ఈ పెరుగన్నంలో గుండ్రంగా ఎర్రగావున్న మామిడి పండు బద్ద, పాలసముద్రం మధ్య నుండి లేచిన అరుణారుణ కమలంలా లేదూ...."

"ఆఁ - నల్లని ఈ ఇంట్లో తెల్లని నేను, నీలాకాశంలోని చందమామలా కూడా వున్నాను - నీలి కొలనులో వెన్నముద్దలాంటి హంసలా కూడా వున్నాను."

శ్రీనాథుడు మహానందభరితుడైనాడు.

"తాయారూ ! ఇప్పుడు నువ్వు నా భార్య వనిపించుకున్నావు - ధన్యుణ్ణి నేను - ధన్యుణ్ణి."

x x x x

తెనాలిలో శ్రీనాథుడికి సన్మానం జరిగింది. స్థానిక నటరాజ కళాసమాఖ్య వారు తమ వార్షికోత్సవ సందర్భంలో శ్రీనాథుడికి ఈసారి సన్మానం చేయాలని నిశ్చయించుకున్నారు. అతి కష్టంమీద శ్రీనాథుడు అంగీకరించాడు. సన్మాన

సభకు మంగతాయారును రమ్మన్నాడు కాని రాలేదు. శ్రీనాథుడే బస్సెక్కి తెనాలి చేరాడు - కార్యకర్తలు చాలా గౌరవంగా చూచారు శ్రీనాథుణ్ణి. సభ ప్రారంభమైంది.

అధ్యక్షోపన్యాసంలో ఆయన చెప్పారు- శ్రీనాథుడు కేవలం మన మండలమేకాదు మొత్తం ఆంధ్రదేశం గర్వించదగ్గ కవి. ఇలాంటి భావుకుడు మన జిల్లావాడు అందులోనూ మన తాలూకావాడు కావడం మన అదృష్టం - మన తెనాలికి పక్కన ఊమనివాడు కావడం ఇంకా ఇంకా మన సౌభాగ్యం. రచయితలను మనం ఇకమీద జిల్లాలస్థాయిలో విభజించి చూడాలి. పూర్వం శ్రీనాథుడి రెడ్డి రాజ్యానికీ మండన మిత్రుడి కర్ణాటక రాజ్యానికి చాలా దెబ్బలాట వుండేది- ("మండన మిత్రుడుకాదు డిండిమభట్టు" అని ఒకరి కేక) క్షమించండి - ఇందాకే బోస్ రోడ్‌లో శంకర జయంతి సభలో పెల్గొని వచ్చాను. అందుకని పొరపాటు పడుతున్నాను. అలా డిండిమభట్టును అలనాటి శ్రీనాథుడు ఓడించడంవల్లనే రెడ్డి రాజ్యానికి కీర్తి ప్రతిష్టలు లభించాయి. సోదరులారా! మనమంతా ఇకమీద ఒక నవ సమాజ నిర్మాణానికి నడుంకట్టి వున్నాము. అధికోత్పత్తి మన లక్ష్యం. అన్ని రంగాలలోనూ ఎక్కడికక్కడ సర్వతోముఖాభివృద్ధి స్వయంసమృద్ధి ఆదర్శాలుగా మన కార్యక్రమాలు ఏర్పాటుచేసుకున్నాం. కాబట్టి రచయితల్లో కూడా మనం అధికోత్పత్తినీ స్వయం సమృద్ధినీ సాధించాలి. పొగాకును ఎలా మనం గుంటూరు తెనాలినుండి విదేశాలకు ఎగుమతి చేస్తున్నామో అలాగే రచయితలనుకూడా ఇతర దేశాలకు ముఖ్యంగా ఇతర రాష్ట్రాలకు అందివ్వగలగలగాలి. ఇతర ప్రాంతాలవారూ మనలను మిగులు రాష్ట్రంగా ఆదర్శప్రాంతంగా గుర్తించాలంటే మనం శ్రీనాథుడివంటి రచయితలను ఎక్కువగాప్రోత్సహించాలి. ఇప్పుడు రైతులకు మనం ఎలా రుణాలు ఇప్పించి అధికోత్పత్తినిచ్చే వంగడాలను సప్లయ్ చేస్తున్నామో అలాగే మనం అక్షరాస్యులైన ప్రతివాడికీ తక్కువ ఖరీదుకు కలాలూ కాగితాలు సప్లయ్ చేయించాలి ఇల్లిల్లూ ఒక కర్మాగారం కావాలి- ఒక సాహిత్య మందిరం కావాలి- ఒక శారదా సుందరం కావాలి- (చప్పట్లు) సోదరులారా! ఇప్పటికే అకాలమయింది శ్రీనాథునివంటి కవులు ఎక్కువ సంఖ్యలో రావడానికై కవుల కాలేజీలు కొన్ని స్థాపించాలని మనం స్థానిక ఎం.ఎల్.ఏ ల ద్వారా మంత్రివర్గంపై వత్తిడి తీసుకురావాలి (చప్పట్లు) అలాంటి కాలేజీలు తీసుకురాకపోతే మనం ఓట్లు వేసేదిలేదు.... (దీనికి సగం

మంది మాత్రమే చప్పట్లు కొట్టారు.) మొన్న చూడండి విజయవాడ కవతల పదిబెడ్ల హాస్పటల్ స్థానిక కార్యకర్తల సహకారంతో చందాలతో నిర్మించి ప్రారంభోత్సవం చేసి వచ్చాను ఆనాడు చెప్పాను ఇది నూరుబెడ్ల హాస్పటల్ గా మారాలని- అలాగే అయింది. ఇకమీద అది వెయ్యిబెడ్ల హాస్పటల్ కావాలి (చప్పట్లు). ఆపూరూ పూరు ఓ పెద్ద హాస్పటల్ గా మారాలి- అక్కడ ఇక ఇణ్నా మనుషులూ మిగలకూడదు (చప్పట్లు)- అలాగే మిత్రులారా! మనం శ్రీనాథునివంటి కవులను పోషించాలి- ఇలాంటి శారదామూర్తులే గుంటూరు, విజయవాడ, ఒంగోలు, కాకినాడ, విశాఖ, హైదరాబాదు వంటి ప్రాంతాలకు ఆదర్శంగా వుండి వీరినుండి వారంతా స్ఫూర్తి పొందాలి ఈ సభకు నన్ను అధ్యక్షత వహించమన్నందుకు కృతజ్ఞుణ్ణి- మరో సమావేశంలో పాల్గొనాలి- జై హింద్-" అధ్యక్షులవారు లేచి వెళ్ళారు. దానిలో నటరాజ కళా సమాఖ్య అధ్యక్షుడే సభకు అధ్యక్షుడుగా కూర్చొని కార్యక్రమం నిర్వహించాడు. ఆ రాజకీయ వేత్త, వెళ్ళడంతో సభలో గ్లామర్ తగ్గింది. సభాధ్యక్షుడు శ్రీనాథునితో "ఇప్పటికే కాలాతీతమైంది క్లుప్తంగా ఓ నాలుగైదు నిమిషాలు మాట్లాడి ముగించండి" అన్నాడు. శ్రీనాథునికి నిరాశ కలిగింది. తన సాహిత్యం ఏ రకంగా కీట్సు షెల్లీలకంటే గొప్పదో ఈ సభలో నిరూపించాలనుకున్నాడు. వర్డ్సు వర్తు కన్నా ఎలా కొత్త ప్రకృతి సౌందర్యాన్ని తాను ప్రదర్శించాడో వివరించాలనుకున్నాడు. కృష్ణశాస్త్రి, రాయప్రోలు, టాగూరు వంటి కళాశిల్పుల కవిత్వాన్ని గురించి వ్యాఖ్యానించాలనుకున్నాడు. తానసలు 'తిరుపతయ్య' అన్న పేరు కళాత్మకంగా ఎలా మార్చుకున్నాడో చెప్పాలనుకున్నాడు. తిరు అంటే శ్రీ, పతి అంటే నాథుడు కాబట్టి 'శ్రీనాథుడు' అని పెట్టుకున్నాడు. నేనేమీ వెర్రి వ్యామోహంతో కొండశ్రీ గుండుశ్రీ చెట్టుశ్రీ గుట్టశ్రీ అని శ్రీని చివర తగిలించుకోవాలనే వ్యామోహంతో ఈ పని చేయలేదు- నాకు శ్రీ ముందే వచ్చింది- అదీ స్వభావసిద్ధంగా పేరులో అంతర్భాగంగానే వచ్చింది.' అని వివరించాలనుకున్నాడు- కొంచెం కొంచెం వివరించాడు కూడాను- కాని అధ్యక్షులవారు 'శ్రీనాథులవారూ-ఇక చాలించండి' అని హెచ్చరిక.

హతాశుడై శ్రీనాథుడు ప్రసంగాన్ని ముగించాడు.

ఆ తర్వాత పూలదండ వేశారు-

ముఖాన వీరకుంకుమ పెట్టి చందనం చల్లి తాంబూలమూ ఓ ఖాదీ శాలువా ఇచ్చి సత్కరించారు.

అక్కడితో సన్మానసభ ముగిసింది.

తర్వాత నాటకాలు.

శ్రీనాథుడు కార్యకర్తలకు కృతజ్ఞత చెప్పి త్వరత్వరగా బస్స్టాపుకు చేరాడు - వల్లభాపురం పోయే ఆఖరి బస్సు చెడిపోయింది - గత్యంతరం లేక స్టేషను చేరి ఓ ప్యాసెంజరు బండిలో అర్థరాత్రికి దుగ్గిరాల చేరి అక్కడినుండి నాలుగు కిలోమీటర్లూ నడుచుకుంటూ తొలికోడి కూసే వేళకు ఇల్లు చేరాడు- "మధురమైన వేదనలో ఆర్ద్రమైన భావన, రసార్ద్రమైన భావనలో విధుర సుధా మధురి- ఉషా! ఓ ఉషా! నా ఉషా" అని తెల్లవారుజాముపై ఓ పాట పాడుతూ "తాయారూ- తాయారూ-" అని తలుపు కొట్టాడు.

మంచి నిద్దురలో వుందామె. లేచి విసుగ్గా తలుపు తీసింది.

"ఏమండీ ఎంత టైమయింది ఇప్పుడు."

"తెల్లవార వస్తోంది. ఉషాదేవి తెలివెన్నెల వెన్నెల తోరణం చూడు."

"ఇంత రాత్రి వచ్చారేం."

"బస్సులేదు- అందుకని...."

"అక్కడే వుండి తెల్లవారాక రాకపోయారా-"

"లేదు తాయారూ- జీవితంలో అందమైన ఒక ఉషస్సును తెనాలి డైనేజీ కాలువల పక్కన వృధా చేయదలచుకోలేదు-అందుకని...."

తాయారు మాట్లాడకుండా పడుకున్నది.

ఎలాగో నిద్రపోయింది మళ్ళీ - భర్త మాత్రం ఏదో 'ఉషాసుందరీ' అంటూ పాడటం ఆమెకు మగతగా విన్పడుతూనే వుంది.

తెల్లవారి లేచాక ప్రశ్నించింది 'ఏం చేశారండీ సన్మానం?'

శ్రీనాథుడు సన్మాన వివరాలన్నీ చెప్పాడు. తన్ను ఎలా అధ్యక్షుడు పొగిడింది ప్రేక్షకులు ఆదరించింది వివరించాడు -

"అదంతా సరే, ఎంత డబ్బిచ్చారు?"

"డబ్బా !" ఆశ్చర్యంగా ముఖం పెట్టాడు శ్రీనాథుడు.

"ఔను . ఎంత ఇచ్చారండీ -" సూటిగా అడిగింది.

"డబ్బెందుకే మనకు -"

తాయారుకు కోపం వచ్చింది.

"ఎందుకేమిటండీ - ఖర్చు పెట్టుకోవడానికి - మంచి ఆవు నెయ్యి కిలో నలభై రూపాయలు - మొలకొలుకుల బియ్యం కిలో మూడు రూపాయల డెభై అయిదు పైసలు - కందిపప్పు కిలో ఐదు రూపాయల ఇరవై పైసలు - ఉప్పు . ముష్టి ఉప్పు నా చిన్నతనంలో రూపాయికి ఇరవై మానికలు పోసి వెళ్ళడం ఎరుగుదును - ఇప్పుడు పాకెట్ నూటముప్పై పైసలు - ఇక పెసలు...."

'పోనిద్దూ, ఈ జాబితా అంతా ఎందుకిప్పుడు మంగా -'

'ఎందుకేమిటండీ - నిద్రలేచిన దగ్గరినుంచీ మనకు కావలసింది ఇదే - ఉప్పు పప్పూ నెయ్యి బియ్యం ఇవేకావాలి-మీ ఉగాదులూ ఉషస్సూలూ నిశీధులూ త్రిసంధ్యలూ ఎవడికాౘవాలట - ఉషస్సు తిండి పెట్టదు - నిశీధి నెయ్యి నివ్వదు - రాత్రిపూట చుక్కలు బియ్యాన్నీ. వెన్నెల ఉప్పునూ పప్పునూ ఎన్నడైనా రాల్చాయా ? - చెప్పండి నా ప్రశ్నకు సూటిగా జవాబు -'

శ్రీనాథుడు నిట్టూర్చాడు - ఒక్క క్షణం ఆగి అన్నాడు. 'అంటే నీ ఉద్దేశం ఏమిటి కవిత్వాన్ని కమర్షియలైజ్ చేయమంటావా ? అక్షరాలను అమ్ముకొని శబ్ద వర్తకుణ్ణి కావాలంటావా ?'

'అయ్యో ఖర్మ ! మీరు అమ్మినా, మీ వద్ద కొనే తలకుమాసినవాడెవడండీ - ఎవరికి కావాలి మీ ముష్టి కవిత్వాలు - ఇంతకూ మీరు మాట దాటవేశారు - వాళ్ళు డబ్బు ఎందుకివ్వలేదూ అని నేనడుగుతున్నాను - డబ్బు లేనప్పుడు సన్మానానికెందు కంగీకరించారు ? కనీసం రానూ పోనూ కారన్నా ఇవ్వవద్దా.'

"చూడు - మంగా - కారుమీద మోజు పెరిగితే కవిత్వం అస్తి నాస్తి విచికిత్సలో పడుతుంది. అప్పుడు కవిత్వం పెట్రోలు వాసన కొడుతుంది.పచ్చకర్పూరంతో రంగరించి సింగారించిన రచయితల శ్రీగంధపు వాసన రాదు - నాకేదో దేవుడు కొద్దిగా భూమి ఇచ్చాడు. ఉండనొక ఇల్లు వున్నది - భుక్తికి లోపం లేకుండా వెళ్తున్నది - కవిత్వం వ్రాయడానికి ఇంతకుమించిన దివ్యవాతావరణం మరింకేమిటి కావాలి తాయారూ - ధనాశతో పరుగెత్తినా టాల్‌స్టాయి కథలా ఆరడుగులే మిగులుతుంది - విలువైన ఈ జీవితాన్ని శబ్దముద్రలో నిబద్ధం చేసి ధన్యులమౌదాము - చరితార్థులమౌదాము - చిరంజీవులమౌదాము."

మంగ హతాశురాలైంది - మారు మాట్లాడకుండా ఇంట్లోకి వెళ్ళింది - భర్తకు వేసిన పూలదండ వాడిపోయి అక్కడ పడేసి వుంది . దాని పక్కనే ఖాదీ శాలువ - దానిమీద దుకాణంవాడు అంటించిన ఖరీదు చీటీ కూడా వుంది - పదహారురూపాయల యాభై పైసలు - అందులో ఓ రూపాయి రానూపోనూ చార్జీలకి వదిలింది - ముష్టి పదిహేను రూపాయల సంపాదనకా రాత్రల్లా నిద్ర కాచి ఇన్ని మైళ్ళు నడిచి వచ్చింది ??

వాళ్ళేం లేనివాళ్ళా ??

మొన్ననే కదా ఒక మంత్రిగారిని సన్మానించడానికి పదిహేనువేలు ఖర్చు పెట్టారు ?? నర్తకి పంకజగంధికి పదివేలు ఇచ్చారు -

తన భర్త ఎలా అర్థం చేసుకుంటాడీ వేదనను ?

నూటపదహార్లు కనీసం అర్ధనూటపదహార్లు భర్తకు రావాలని కోరుకోవడం అన్యాయమా ? అక్రమమా ??

సరస్వతికి అపచారమా ??
పూర్వం మహారాజులు గుర్తించి పోషించేవారట -
ఇప్పుడెవరున్నారు ??
ప్రజలే కదా ??
వాళ్ల శ్రీనాథుణ్ణి గుర్తిస్తున్నారా ??
వాళ్ళకీ ప్రకృతి ఉపాసకులతో పని వుందా ??

శ్రీనాథును జఘన్య శృంగారాన్ని వర్ణించలేడు. కచకుచాలపై పద్యాలు వ్రాయలేడు. కవి చౌడప్పను ఆధునికంగా ఆవిష్కరించలేడు. కాబట్టే శ్రీనాథునికి మార్కెట్ లేదు.

శ్రీనాథుడు ఇద్దరు శాలువా తప్ప సంపాదించలేడు. తానూ తన అక్కలాగా మేడ కట్టుకోవాలనీ అందులో ఓ టి.వి. ఓ ఫ్రిజ్, ఓ ఎర్ర గుల్‌మార్గు ఎయిర్‌కూలర్, ఓ డెకోలమ్ సోఫా కంబెడ్స్ అలంకరించుకోవాలనీ అనుకుంటున్నది.

తానూ షారిన్ నైలెక్సులు కొనుక్కోవాలనుకుంటున్నది.

అది శ్రీనాథుని సన్మానాలతో సాధ్యమా?

అసంభవం!!

మంగతాయారు మనస్సు వికలమైంది.

ఆమె ఏదోలా వంట చేసింది.

శ్రీనాథుడు భోంచేస్తూ అడిగాడు "మంగా! వంకాయకూరలో ఎండు కొబ్బరి కోరి వెయ్యలేదేమిటి? పైగా లవణం కూడా ఓ కల్లు ఎక్కువైంది."

తాయారు మాట్లాడలేదు.

"ఏం మంగా - ఎందుకిలా ఉప్పు ఎక్కువ వేశావు?"

"అవునండీ - కొందరి బ్రతుకులు చేదుగా వుంటాయి - వారినుండి మీవంటి మహాకవులు తీపినెలా ఆశిస్తారు?"

* * *

తాయారూ, శ్రీనాథుడూ తిరుపతి కొండ మెట్లెక్కడం మొదలు పెట్టారు.

పెట్టెను మాత్రం తమ వూరినుండే మొక్కుకై వచ్చిన ఒక తెలిసిన వాడితో బస్సులో ముందుగా పంపించారు.

బాగా ఎండ తగ్గాక సాయంత్రం ఏ మూడున్నర నాలుగు గంటలకో నడక మొదలైంది.

ఒక్క మోకాళ్ళ పర్వతం చేరడానికే గంటకు పైగా పట్టింది. 'ఏడు కొండలవాడా! వడ్డెకాసులవాడా! అడుగడుగు దండాలవాడా! గోవిందా!గోవిందా!' కొండ నెక్కుతున్న భక్తుల నిరవధిక స్తోత్ర పాఠాలు.

"అబ్బా - నేనింక ఎక్కలేను బాబూ' తాయారు ఓ గోపురం వద్ద కూలబడింది.

శ్రీనాథుడు నవ్వాడు-

"మంగా! శ్రమిస్తేనేకాని శ్రీనివాస సాన్నిధ్యం లభించదని దానిలోని అంతరార్థం. ఇంటినుండి కారులో బయలుదేరి స్వామివారి సింహద్వారం ముందు దిగితే అతడికి స్వామినందుకోవడంలో వున్న కష్టం ఎలా తెలుస్తుంది? అందుకే చూడు శ్రీశైలం, తిరుపతి, అమరనాథ్, బదరీ, అన్నీ పర్వతాగ్రాలమీద, కీకారణ్యాల మధ్య దాట వీలుకాని నదులకు నడుమ నిలిచాయి వెలిశాయి."

తాయారు శరీర శ్రమను భర్త మాటలు పోగొట్టలేకపోయాయి ఆ గోపురంలో సోడాలు అమ్ముతున్నారు.

తాయారు ఓ సోడా తాగింది.

కాసిని వల్లీలు బటానీలు కొనుక్కొని తిరిగి నడక సాగించింది.

శ్రీనాథుడు మాత్రం హుషారుగా పాలపిట్టలా దూసుకొంటూ ముందుకు సాగాడు.

భక్తులు రకరకాల వేషాలవాళ్ళు, భాషలవాళ్ళు, వయసులవాళ్ళు, మూటలు కూడా నెత్తిని పెట్టుకొని నడకమార్గంలో పయనం సాగిస్తున్నారు.

రకరకాల కోరికలవాళ్లు.

గమ్యాల వాళ్లు.

చేస్తున్న రత్నాల వ్యాపారంలో లాభం వచ్చినందుకు నడిచి ఎక్కే మొక్కు చెల్లించి ఓ రత్నాన్ని స్వామివారి హుండీలో వేసేందుకు వస్తున్న బీదరు చెన్న బసప్ప.

కూతుళ్ళ పెళ్ళి కోసం గత్యంతరం లేక పొలమూ, ఇల్లూ అమ్మి పెండ్లి పూర్తి చేసిన ఓ తండ్రి, ఎన్నికలలో నిలబడి గెలిచి పదవి సంపాదించి అది ఇప్పించినందుకు గాను బాలాజీకి తలనీలాలు సమర్పించడానికి వచ్చిన ఒక యు.పి. వాలా.

దత్తు తీసుకున్న ముసలమ్మ త్వరగా కాలంచేసి ఆస్తి అధికారం చేతికి వచ్చినందుకు - కల్యాణం చేయించడానికి బయలుదేరిన ఉలవపాడు వెంకయ్య నయం కాదనుకున్న టి.బి. నుండి బయటపడి పత్నీసమేతంగా నేరుగా రాయవెల్లూరునుండే తిరుపతి కొండ ఎక్కుతున్న సాయిలూ, రత్నావళీ!

'తాయారూ ! కోరికలు తీస్తున్నకొద్దీ సీరూ రే దారువులవంటివి - వాటిని పరమేశ్వరుడైనా సరే సమగ్రంగా ఎలా తీరుస్తాడు?'

మంగకు ఈ మాటలు రుచించలేదు. 'కవిరాజా! కోరికలు ముత్యపు చిప్పలు కూడా కావచ్చు. కొందరు భక్తుల హృదయాలు స్వాతివానకు పడే పరమేశ్వరుని అనుగ్రహ రస బిందువులకై ఎదురుచూస్తూ వుంటాయి - ఒక కిరణం ఒక తుషారం పడితే చాలు ముడుచుకొని లోలోపల దానిని ముత్యంగా మార్చుకుంటాయి.'

శ్రీనాథుని హృదయం పరవశించిపోయింది.

మంగతాయారిప్పుడు ఉత్తమ జాతికి చెందిన కవిత్వం చెప్పింది. తన సహవాసంతో ఆమె జన్మ పునీతమైంది.

'మంగా! ఇంత చక్కని ఉపమానం ఎలా చెప్పావు?'

'ఏదో మీ దయవల్ల పూలతో కూడిన దారానికి వాసన పట్టదూ - చందన వృక్షం చుట్టూ వున్న తరువులన్నీ చందన వృక్షాలుగానే మారవూ-అలాగే.'

ఈ ఉదాహరణలన్నీ తాను ఏదో సందర్భంలో వాడినవే - వాటిని తాయారూ జాగ్రత్తగా జ్ఞాపకం పెట్టుకున్నది - మళ్ళీ తనమీదనే ప్రయోగిస్తున్నది.

తాయారు చాలా మందంగా నడుస్తున్నది- అందువల్ల శ్రీనాథుడు మనో వేగాన్ని గమనవేగంతో అనుసంధానించలేకపోయాడు.

త్రోవ కిరువైపులా రకరకాల చెట్లు, రంగురంగుల పండ్లు, పండ్లన్నీ తినడానికుపయోగపడేవికావు. పూలన్నీ సుగంధాన్ని వెదజల్లేవికావు - అయినా సరే! అన్నీ ఉండాల్సిందే - సృష్టిలో దేనిస్థానం దానిదే! ఆవేమి ఓషధులో!

చీమలు బారులుగా సాగిపోవడంవల్ల రాతికి బాగా వేలెడు వెడల్పు బాట ఏర్పడింది.

ఎన్ని యుగాలిలా చీమలు నడిస్తే రాయి చీలిందో ఎన్ని తరాల భక్తుల నిరంతర పాద ఘట్టనచేత ఈ పుట్టలూ గుట్టలూ బాటలుగా పేటలుగా మారాయో-

"తాయారూ! చూడు, చూడు, ఈ రంగురంగుల పిట్టలెలా ఎగురుతున్నాయో - తోక ఎరుపూ తెలుపూ దేహమంతా నలుపు తలమీద వేలెడు కిరీటం - ఓహో! ఈ ఒక్క పక్షిని చూస్తే చాలు తాయారూ మన శ్రమ మొత్తం పోయి యాత్ర సార్థకం కావడానికి.'

తాయారు కోపంతో అన్నది 'పక్షులూ, కోతులూ చూచి యాత్ర సార్థకం చేసుకునేందుకుకాదు మనం వచ్చింది - మొక్కుబడి చెల్లించుకోవాలి. స్వామి వారిని చూడాలి.'

"అదీ చూస్తాము. ఇదీ చూస్తాము - ఇదంతా చూడటంకూడా అది చూడటంలోని భాగమే! ఆ విశాల నేత్రాల వాడి కరుణా కటాక్షమే ఈ ప్రకృతిగా పరిణమించి మనలను పలకరిస్తున్నది - దేహం పులకరిస్తున్నది-"

'కాని స్వామీ! యాత్రికులంతా అంత తెలివిమీరినవారు కారు. తమ త్రోవ వెంట తాము పరుగెత్తుకుంటూ పోతున్నారు.'

'మూర్ఖులు- వాళ్ళంతా భక్తులు కాదు తాయారూ-చాలామంది బేరగాళ్లు- స్వామివారి కటాక్షాన్ని అలుసుగా తీసుకోని బేరంవేసి లాభంవస్తే వడ్డీ చెల్లించేందుకు పరుగెత్తుకుపోతున్నారు- వాళ్ళకీ తురాయి పిట్టల తోకలు కన్పడవు- రాళ్ళమధ్య దారిపక్క పూచిన గడ్డిపూవు పలకరింపు వినపడదు- ఆకాశంతో ఈ చల్లనివేళ సప్తాశ్వాల వాడి ఒక తెల్లని కిరణం ఏడు రంగుల పూలను పూయిస్తున్నప్పుడు ఏడవ కొండపై నుండి చూడటం పేరు భగవదుపాసన కాదా? కాని ఆ ఉపాసన చేయలేరు వీళ్ళు - కేవలం పరుగెత్తుతున్నారు కాలాభిముఖంగా-శలభాల్లాగా- జీవచ్ఛవాల్లాగా.'

తయారుకు భర్త సామి దూషణ చేస్తున్నాడనిపించింది- 'మీ పిచ్చి మితిమీరిపోతున్నది- దేవుని కభిముఖంగా పోయే భక్తులను దూషిస్తే మీకు పుట్టగతులు వుండవు.'

'తాయారూ-తాయారూ నీదింత మట్టిబుర్ర అనుకోలేదు- దేవుణ్ణి నేను తిట్టడంలేదు- దేవుడు ఏడుకొండలపైనే కాదు ఏడు కొండలనిండా వున్నాడు చూడమంటున్నాను- ఆరాదించమంటున్నాను- ఇంతకన్నా సరళాతి సరళంగా ఇంకెలా చెప్పను నా వేదాంతం-కొండపైనా కిందా మీదా లోపలా కూడా స్వామి నాకు దర్శనమిస్తున్నాడు-"

ఒకచోట కొండపై భాగం నుండి జలధార సన్నగా ప్రవహిస్తున్నది. కింద కాకీరత్నం తీగెలు అల్లుకోని వున్నాయి-

ఆ పక్కనే కొన్ని పేరుతెలియని గడ్డి మోదుగు ఆకులూ-

జలబిందువులు కొన్ని మోదుగు ఆకులపై బడి, చింది తుషారాలుగా మారి కాశీరత్నం పూల చిన్నారి రేకులపై చిద్రుపలుగా రాలాయి-కారిన ఆ నీటి రేఖ గాలిలో కలిసి చల్లదనం కిందికి పరివర్తన చెందింది-

"ఓహో! దివ్య సౌందర్యానికిది పరాకాష్ట!పరమేశ్వర తత్వానికిది ప్రత్యక్ష వ్యాఖ్యానం - సౌందర్య గుణం పాకారంగా నిలిచి జలము వాయువుగా స్పర్శగా మారి శబ్దంగాపర్యవసిస్తున్నది-అనుభూతిగా పరిణామం చెందుతున్నది.తాయారూ- ఇదుగో స్వామివారినిక్కడ చూడు- పలుకుతే నేలతల్లి పవ్వళించిన వేళ సద్దు సేయకు తాయారూ-" అన్నమాచార్యుని కీర్తనలు ఆయనలో పొంగి పొర్లుతున్నాయి- దూరాన చంద్రగిరి దుర్గం పురాతన వైభవానికి చిహ్నంగా కొడికట్టిన దీపంలా కన్పడుతున్నది.

"ఇదుగో! ఇటు చూడు తాయారూ అగాధమైన లోయల్లోనుండి ఉవ్వెత్తున తారాజువ్వల్లా పైకిలేచిన ఈ చెట్లు ప్రకృతి దేవాలయానికి సగర్వంగా ఎత్తిన ధ్వజస్తంభాల్లా వున్నాయి- పరమేశ్వరుని పాదార్చనకోసం పుడమితల్లి దాల్చిన పూల కిరీటంలా వుంది ఈ లోయలో తల పైకెత్తిన చెట్ల సౌందర్యం" శ్రీనాథుడు ఏదో లోకంలో విహరిస్తున్నాడు. అక్కడ బస్సు రోడ్డూ - కాలిబాటా- కలుస్తాయి.

తానుమాత్రం అలసిపోయి కాలిబాట చివర కూర్చున్నది తాయారు- ఇంతలో ఓ కారు ఆ మార్గాన దూసుకుంటూపోతూ తాయారును చూచి ఆగింది.

వెంటనే కారు తలుపు తీసుకొని వైదేహి దిగింది.

తలెత్తి తాయారు చూచింది ఆశ్చర్యంగా. 'అక్కా'

"తాయారూ-ఎప్పుడు బయలుదేరారు- ఏమిటి?"

అక్కకు చెల్లెలు తన తీర్థయాత్రాక్రమం వివరించింది.

"రానూ పోనూ నడిచి వస్తామని మొక్కుకున్నాముక్కా- అందుకని...."

"అరే- మాకు కనీసం జాబన్నా వేయలేదేమిటి?" వైదేహి సాధించింది.

"నేనేం కలగన్నానా మీరూ ప్రయాణం పెట్టుకున్నారని-"

"ఔను- అది కూడా నిజమే- మావారికి ఈసారి బిజినెస్‌లో బాగా లాభం వచ్చింది - సారాయికి పనికిరావనుకున్న అనాబ్‌షాహీని ఉత్తరాది వాడొకడు హోల్‌సేల్‌కు కొన్నాడు - రూపాయికి రెండు రూపాయల లాభం-అందుకని వారు అకస్మాత్తుగా ఇలా ప్రయాణం పెట్టారు. రాత్రి బయలుదేరాము కారులో హైదరాబాదునుంచి-" శ్రీనాథుడు కారు డ్రైవింగ్‌చేస్తున్న లక్ష్మణమూర్తిని పలకరించాడు.

లక్ష్మణమూర్తి ముభావంగా, మర్యాదసూచకంగా ఏవో యథోచితమైన మాటలు నాలుగు మాట్లాడాడు. ఆ మాటల్లో ఆప్యాయతలేదు. సమానస్థాయివాణ్ణి గౌరవించినట్లులేదు.

"తాయారూ రండి, కారెక్కండి ఇద్దరూనూ ఓహో - మొక్కు కదూ - సరే! మేము కాటేజి ముందే రిజర్వు చేయించాము - మీకోసం పైన ఎదురు చూస్తుంటామయితే" వైదేహి చెల్లెల్ని, బావగారినీ తమ కాటేజీకి ఆహ్వానించింది.

లక్ష్మణమూర్తి కాటేజీ నెంబర్ చెప్పాడు.

శ్రీనాథుడు తల వూపాడు.

వైదేహి కారెక్కింది.

చెల్లెల్ని విష్ చేస్తూ చెయ్యి వూపింది.

కారు తారురోడ్డుమీద దూసుకొనిపోయింది.

ఊపుతున్న వైదేహి చేతి రత్నాల ఉంగరం కాంతులు కనపడుతున్నంత దూరం అలాగే చూచి ఆ తర్వాత లేచి తిరిగి నడక కుపక్రమించింది.

శ్రీనాథుడు నడవలేకపోతున్నా హుషారు తగ్గకుండానే సాగుతున్నాడు.

తాయారు మాత్రం ఇక పైన నడవలేకపోయింది.

వైదేహి కారు చక్రాల చారల్లో తన అడుగులువేసి ముందుకు సాగలేక పోయింది.

చీకట్లు నలుమూలలా ముసిరాయి.

దూరాన తిరుమల దీపాలు మిణుకు మిణుకుమని కన్పిస్తున్నాయి.

"మంగా !"

"ఆఁ!"

"కొంచెం వేగంగా అడుగులు వేయాలి."

"నడవలేకపోతున్నానండి."

'నిజమే! కాని చీకటి పడింది చూడు - అంటే ఇప్పటికే సుమారు మూడున్నర గంటలకు పైగా నడిచాము-'

'............... ...'

''మంగా''

'ఏమిటి ?'

'స్వామివారి చుట్టూ దీపాలెన్ని వున్నా చుక్కల్లాంటి మిణుగురుల్లాంటి ఈ క్షణికమైన విద్యుత్కాంతితో ఆయన సంతృప్తి పడడు, భక్తపరాధీనుడైన శ్రీనివాసుడు మంగతాయారు రాకకోసం ఎదురు చూస్తుంటాడు - చంద్రునికోసం సముద్రంలా-'

"స్వామీ త్రాచులా పాగుతున్న ఈ తారు రోడ్డుపై మీరే సాక్షాత్తు శ్రీనివాసునిలా వున్నారు- నేను కేవలం మీ ఛాయలా నడుస్తున్నాను. చూడండి. ఎందుకొచ్చిన కవిత్వమిది- నడవలేక ఒకవైపు అవస్థపడుతుంటే."

'కవిత్వమంటే ఏమిటి ? అదేదో రాజ సభల్లో రసికజనులు వినోదించే సాధనమనుకున్నావేమో . కాదు, అది నిత్యజీవితంలో అనుక్షణం అనుభవించ

దగ్గ అమృత రసాయనం. తెలియకుండానే ప్రతివాడూ వాడే ప్రతి పర్యాయపదంలో దయమైన వచన కావ్యం. ఈ మేడ లాకాశాన్నంటాయి. ఈ పొట్లకాయ చూడు బారెడు పొడుగున ఉంది - వాడమ్మ కడుపు బంగారం కానూ ఏం చేశాడయ్యా, వాడా వాడొక ధర్మరాజు, ఆ పిల్లగా గారె ముక్కలా వుంది - నీ బుగ్గలు గిల్లి బూరెలు వండుతాను - తాయారూ ఏమిటి ఇవన్నీ - ఈ ఉక్తివైచిత్రి మొత్తం కవిత్వం కాదూ - ఇదంతా కవిత్వమని తెలిసే స్త్రీలు సంభాషణల్లో వాడుతున్నారంటావా ?'

మంగతాయారు మనస్సు అన్యాసక్తమై వుంది.

'ఏమండీ'

'ఏమిటి ?'

'వైదేహి కొంచెం లావెక్కింది సుమా !'

'అఁ. మీ బావగారుకూడా చిన్న కుంభకర్ణునిలా వున్నాడు.'

"ఎందుకండీ ఆయనంటే మీ కంత అసూయ ?"

"అది నేననవలసిన మాట - నిరంతరం వాళ్లు నీ మనస్సుల్లో మెదులుతూ వుండటంవల్ల అసూయతో వాళ్ల సంభాషణకే ఉపక్రమించావు. నాకెందుకసూయ నాకేం ఆబిడ్స్‌లో బ్రాందీషాపు వుందా ? నాకూ లక్ష్మణమూర్తికీ అనాబ్ షాహీలో పోటీ ఏమైనా వచ్చిందా ?? ఆయనది మద్య వ్యాపారం నాది హృద్యమైన పద్య వ్యవసాయం. పద్యానికి మద్యానికి 'మొదట్లో' పోలికేలేదు, తర్వాత ఉన్నట్లు కన్పడా ఉపనిషత్తుల్లో 'ద' కథలాగా ఒకటి ఆత్మానందాన్ని ఇస్తే రెండవది పాశవికానందాన్ని చవిచూపిస్తుంది - తాయారూ - ఎవడి అర్థం వాడిది - ఎవడి అనుభూతి వాడిది - వాళ్లగూర్చి మనం 'ఆ' జన్మ శత్రువులుగానూ భావించ నక్కరలేదు. 'ఆ'దర్శంగానూ స్వీకరించవద్దు - 'ఆ'కార సామ్యమున్నంత మాత్రాన రెండూ ఒకటి కావు - ఇర్వురల 'ఒకటి' కావడం ఎలా సాధ్యం ?'

శ్రీనాథుడు శబ్దబ్రహ్మోపాసకుడు -

కాబట్టే అతని ప్రతిమాటా వ్యంగ్య వైభవంతో శోభిల్లుతూ వుంటుంది. ప్రతి పదానికీ వెనుక మరికొన్ని అర్థాలు వాటంతట అవే భాసిస్తూ వుంటాయి.

మొదట్లో పోలికలేకపోవడం, అర్థం, ఆకారసామ్యం, అన్న చమత్కారాలు మంగకు అర్థంకాలేదుకాని ఇర్వురం ఒకటికావడం ఎలా సాధ్యం అంటే ఇటు శ్రీనాథుడూ అటు లక్ష్మణుడూ ఒకటికాదని సూచించడం బోధపడింది.

అంటే దేవునికీ జీవునికీ భ్రాతృత్వమే కాని ఐక్యంలేదని శ్రీనాథుడు సిద్ధాంత ప్రతిపాదన చేస్తున్నాడనికూడా మంగ తాయారుకు స్ఫురించింది.

అయితే ఆమె మనస్సు ఈ చమత్కారాలను ఆనందించే స్థితిలోలేదు.

రాత్రి ఏడున్నర ప్రాంతాలకు తిరుమలలోకి ప్రవేశించారు.

బస్సు దిగేచోటు తమ పూరి మల్లయ్య తన కొడుకు వెంకటాద్రిని కూర్చోపెట్టాడు.

వెంకటాద్రి శ్రీనాథ దంపతులను తమ వెంట మల్లయ్య దిగిన ధర్మ సత్రం దగ్గరికి తీసుకుపోయాడు.

"ఆరుగురి పేర ఈ గది తీసుకున్నాను. మీరూ ఇందులో వుండవచ్చు. నేనూ మా ఆవిడా వెంకటాద్రీ ముగ్గురమే కదా అందులో వున్నది" అన్నాడు మల్లయ్య.

తాయారు శ్రీనాథుణ్ని ఇవతలికి పిలిచి అడిగింది 'ఇక్కడ సౌకర్యాలన్నీ వుండవు - మా అక్కగారి కాటేజికి పోదాము."

శ్రీనాథుడు నవ్వి 'మనం ఇక్కడ మొక్కు కోసం స్వామి దర్శనంకోసం వచ్చాము కాని భోగాలకోసం రాలేదు - ఇక్కడే ఉందాము' అన్నాడు.

బంధువులకు దగ్గరగా వుండటం భర్తకెందుకో ఇష్టంలేదని తాయారు భావించింది.

ఆ బంధువులు తన బంధువులు - రక్తం పంచుకొని పుట్టినవారు - అందుకనే తాయారుకు చాలా బాధ కలిగింది - రాత్రి తెల్లవార్లూ కాళ్ల నొప్పులు తీర్చుకున్నది.

మర్నాడు ఉదయమే లేచి కాలకృత్యాలు నిర్వహించుకొని స్నానంచేసి శుచియై తాయారు ఇవతలికి వచ్చేసరికి శ్రీనాథుడు కన్పడలేదు.

ఆయన ఏ తెల్లవారు జామునో లేచి శ్రీపర్వతం పైనుండి మేఘాలను అందుకుంటూ వున్నాడని గ్రహించింది.

మల్లయ్యా, వెంకటాద్రీ, రత్తాలు ఉదయమే ఇడ్లీలు తిన్నారు.

ఇడ్లీ, ఉప్మా, పెరుగు, పాలు అన్నీ సత్రాలకే అమ్మకానికి వస్తాయి.

తాయారు మాత్రం పచ్చి మంచినీళ్లు పుచ్చుకోలేదు.

సూర్యుని కిరణాలు బంగారు మలామును పర్వతం మొత్తం పూస్తుండగా శ్రీనాథుడు వచ్చాడు.

"స్వామివారి దగ్గర కూడా ఉషస్సును మరచిపోలేదే."

"తాయారూ, శ్రీపర్వతం మీద ఉషస్సు నీవై భాసించింది - స్వామివారు నాలో ప్రవేశించి వున్నారట - ప్రాభాత సమీరాలు వారికి మేలుకొలుపులు పాడాయట-రా, త్వరగా విశ్వదర్శనం వేళ దాటుతున్నది-"

గదికి తాళంవేసి మల్లయ్య కుటుంబమూ శ్రీనాథ దంపతులూ దేవాలయాభిముఖంగా పయనించారు.

ఇది నిత్యోత్సవం

వారోత్సవం

మాసోత్సవం

సంవత్సరోత్సవం-

ఇక్కడ ఋతువులతో ప్రమేయం లేదు-

ముహూర్తాలతో నిమిత్తం లేదు-

నిత్యకల్యాణం పచ్చతోరణం-

వేయి తిరణాల పెట్టుగా హడావుడి - అమ్మకాలు - రంగురంగుల లక్కపిడతల దుకాణాల నడుమ నుండి స్వామివారి బంగారు దేవాలయపు ప్రాంగణం చెంతకు చేరారు.

వడ్డికాసులు బంగారు కాళ్లు, బంగారు చేతులు, వెండికాళ్లు, వెండిచేతులు అమ్ముతున్నాడొక బక్క పిల్లాడు. 'పద్మావతీ శ్రీనివాస కల్యాణం- స్థలపురాణం ఐదు రూపాయల గ్రంథం-రెండు రూపాయలు మాత్రమే' ఇంకొకడు వచ్చాడు. 'రూపాయన్నర కిస్తావా ?' మల్లయ్య బేరమాడాడు- రూపాయి అరవై పైసలకు బేరం కుదిరింది.

పెళ్ళి క్యూను చూచారు.

అది కొండచిలువ చేంతాడులా చాలా పొడుగున వుంది.

"రా, తాయారూ వెళ్ళి నిలబడదాం."

"ఎక్కడ ఈ క్యూలో మైలు దూరంలోనా నిలబడటం."

"మరెక్కడ నిలబడదామనుకున్నావు ? ఎన్నికల్లోనా ?" పరిహాసం చేశాడు.

"బాబూ- ఈ గేటు దగ్గర రెండు రూపాయలు చేతిలో పెడితే పక్కకు మార్గంగుండా వదులుతాడు మనల్ని" శ్రీనాథుడు నవ్వాడు. కాని మల్లయ్యను కించపరచదలుచుకోలేదు-

"ఏమండీ. అలా చేద్దామా ?"

"పది నిముషాల ఆలస్యం కోసం పాపం కొనుక్కుంటామా స్వామివారి ప్రాంగణంలో" మెల్లగా అన్నాడు భార్యతో.

"ఇందులో తప్పేముంది ?"

''ఎందరు భక్తులిలా క్యూలో అర్థరాత్రి నుండే నిలబడివున్నారో తెలుసా? వారందరినీ మోసగించి లంచమిచ్చి స్వామి దగ్గరకిపోతే ఆయన ప్రసన్నుడవు తాడనుకున్నావా తాయారూ."

మల్లయ్యావాళ్లూ డబ్బిచ్చి లోపలికి వెళ్ళారు.

శ్రీనాథుడు భార్యతో సహా పుష్కరిణి దగ్గరకు పోయి కొంచెం తీర్థం నెత్తిని చల్లుకొని వచ్చి క్యూలో నిలబడ్డారు. దాదాపు పదిగంటలయ్యేసరికి క్యూ కొన్ని ఫర్లాంగులు మిగిలిపోయింది.

"స్వామీ కాళ్లు నొప్పులు పుడుతున్నాయి. కాస్త కవిత్వంతో నా బాధ పోగొట్టండి. ఎలా వున్నదీ క్యూ ? చాంతాడులా వున్నదా ? హనుమంతుడి తోకలా వున్నదా ? చెప్పండి కొంచెం."

"కలకండ నందుకోవడం కోసం వెళ్ళే చీమల బారులా వున్నది తాయారూ ."

"దీపాన్ని అందుకోబోయే హారతికర్పూరంలా లేదూ ."

"లేదు ."

"అదేమిటండీ మీ కలకండకన్నా మంచి ఉపమానం చెప్పాను నేను . తన్ను తాను హారతి చేసుకునే భక్తుని హృదయం కర్పూరంలాంటిది . అందులో ఎం క స్వచ్ఛత, పరిమళమూ వుంటుందో గమనిం ండి."

"పూలవాసన నారకు కూడా పట్టినట్లే నీకు కవిత్వం అబ్బినందుకు నేను పరమానందం పొందుతున్నాను. నిజమే, కాని తాయారూ నీ ఉపమానం చాలా లోపభూయిష్టమైనది . భక్తుడు హారతి కర్పూరం నలె స్థాణువు కాడు జడం కాదు. చీమ వలె నిరంతర వ్యాపకత్వం కల జీవి. చీమ వలె చిన్నవాడైనా నిరంతరం సంచలనం కల కుశాగ్రబుద్ధి. లౌకికమూర్తి. ఆ చీమ వెళ్ళి కలకం డను తాకినప్పుడింకేముంది ? బ్రహ్మానందమే . అయితే తాయారూ అంత బ్రహ్మానందంలో కూడా చీమ తన అస్తిత్వాన్ని కోల్పోదు ఇక్కడ అనుభవించే

దొకటి, అనుభవింపబడేదొకటీ రెండూ వుంటాయి హారతి కర్పూరం శూన్య వాదాన్ని ప్రతిపాదిస్తున్నది. తన్ను తాను మొత్తం నశింపజేసుకున్నప్పుడు అనుభవం ఎవరికి ? దేవుడికా ? ?"

తాయారు భయపడిపోయింది. అందంగా వుంటుందని ఓ ఉదాహరణ చెపితే దానిలో ద్వైత విశిష్టాద్వైతాలు ప్రతిపాదించాడు భర్త. దీనికంటే నిశ్శబ్దంగా కోతులనూ. బటానీ బుట్టలనూ చూస్తూ గడపడమే ఆమె ప్రాణానికి హాయిగా కనిపించింది.

దూరంగా స్వామివారి ప్రాంగణం ముందు ఓ కారు ఆగింది - అందులో నుండి వైదేహి లక్ష్మణమూర్తిగారు దిగడం మంగతాయారు చూచింది.

క్యూలో వున్న వారినీ లక్ష్మణమూర్తి చూచినట్లే వున్నాడు....చూచాడని స్పష్టంగా చెప్పలేము.

కాని చూడనట్లే ముందుకు సాగిపోయారు

ఛాయలా వైదేహి ఆయన్ను అనుసరించింది.

"ఏమండీ"

"ఆఁ"

"అదిగో మా అక్కా బావగార్లు వెళ్తున్నారండీ."

"అవును వారేదో కల్యాణం లాంటిది చేయిస్తున్నట్లున్నారు."

"ఇంకేం మరి పదండి వెళ్దాము మనంకూడా. కల్యాణానికి కుటుంబం మొత్తాన్నీ రానిస్తారు కదా."

"కావొచ్చు తాయారూ కాని ప్రవత్తి యోగంలో స్వామిని ఇలా నిరాడంబరంగా శ్రమతో శ్రద్ధతో చూడటంలోనే నాకెక్కువ ఆనందం లభిస్తుంది."

భర్త, తన అక్కా బావల ఐశ్వర్యానికి అసూయపడుతున్నాడేమోనని ఊహించింది తాయారు.

తేలికగానే ఆ భావాన్ని చదివాడా శ్రీనాథుడు అన్నట్లు "స్వామి కల్యాణాలూ బ్రహ్మోత్సవాలూ చేయించవలసిందే - అవన్నీ మంచివే. కాని తాయారూ నేను అర్థార్థినికాను జిజ్ఞాసువును - ఇక్కడ నా వైభవమూ ధన ప్రదర్శనా కావు లక్ష్యాలు - స్వామివారి వైభవం కావాలి - దానినొక సామాన్యునిలా భక్తి భిక్షాన్ని కోరే యాచకునిలా నిలబడి అందుకోవాలి - అది నా తత్వం."

కొంతసేపైన తర్వాత కల్యాణాల వల్ల ధర్మ దర్శనం నిలుపు చేయబడిందని ప్రకటించారు,

తాయారు నిలువలేకపోయింది.

"పోయి కాఫీ తాగిరా - నేనిలాగే క్యూలోనే నిలబడి వుంటాను."

మంగతాయారు కాఫీ తాగి వచ్చింది.

"మానవులంతా ఒకటే - మనది భారతదేశంకాదు అనంతవిశ్వం" అని ప్రపంచ పౌరసత్వాన్ని ప్రకటించుకునే రాజకీయ భక్తుడు, కుచేలుణ్ణి కురూపినీ మాత్రం మానవులుగా గుర్తించలేకపోతున్నాడు.

శ్రీనాథుని హృదయం భగ్గుమన్నది.

ఆ ఇంధనం నుండి శబ్దాలు రవ్వల్లా రాలాయి.

"నరసింహమూర్తి వైనాడు నీవో సామి

శత్రుముష్కరచమూ సైన్యధాటికి ప్రతిగ

భంభరమ్ముల పంపి పారద్రోలితివి కద!"

దర్శనం నిలుపుదలతో చాలామంది క్యూనుండి వెళ్ళిపోయారు. అందువల్ల శ్రీనాథుడు ఎంతో ముందుకు వచ్చాడు.

కుష్టురోగులూ బిచ్చగాళ్ళూ పోతున్నారు గుంపుగా.

"అయ్యా ఒక్క పైసా వెయ్యండి. బాబూ ధరమం తండ్రీ - ఒక్క పైసా దానం చేయండి - ఏడుకొండలవాడా !"

ప్రజలు అసహ్యించుకొంటున్నారు.

మృత్యువును చూచినట్లు దూరంగా తొలగిపోయారు.

సర్వాంతర్యామి అయిన ఈశ్వరుణ్ణి ముష్టివాళ్ళలో చూడలేని భక్తులు త్రాణువుకోసం పరుగెత్తుతున్నారు.

భక్తులను రక్షించి ప్రతిన నిలిపితిని కద !

ఏమయ్యె ఆనాటి శక్తి ?

నేడు

ఎడకేగనయ్యె నీ మహిమ ?

రాక్షస హిరణ్యకశ్యపు చంపి అలనాడు

రక్షించి ప్రహ్లాదు నాహ్లాద పరచితివి

కడుపులోనే కాదు గోడలో భూమిలో

కనకమ్ము గుప్త పరచిన హిరణ్యాసురుల

కాల్పరాదేల నీ అగ్ని, ప్రభవించి
కూల్పరావేల స్తంభమున ? ?"

తాళ్ళపాక వంశస్థుల రక్తం తనలో పారుతున్నదో ఏమో శ్రీనాథుడు స్వామికి అలా విన్నపాలు చేస్తున్నాడు

ఎంతతో బాటు అతని భావ తీవ్రత కూడా పెరిగింది.

"ఈ సమానత మిథ్య
ఇట దుష్టత - అవధ్య - ??
రసభూన్యమైన మా
నవతయే సత్యమ్ము
కరిగి పొర్లవదేం స్వామి ఆకాశ
గంగగా కరుణా(o)తరంగ !!"

కల్యాణోత్సవాలు ముగిశాక లడ్డూలూ అప్పాలూ, నెయ్యి కాల్వగట్టి కారుతున్న పొంగలి బుట్టలూ, దధ్యోజనమూ, చక్కెరపొంగలీ భక్తులకు అందించారు అర్చకులు - లడ్డూల బుట్టలు కారులో ఎక్కించుకొని తలుపులేసుకున్నాడు లక్ష్మణమూర్తి.

వైదేహి ఇటు చూచింది -

క్యూలో శ్రీనాథుడూ మంగతాయారూ -

"అరె - మీరు రాలేదేమిటి కాటేజికి."

శ్రీనాథుడు నవ్వాడు.

"తెలిసినవాళ్ళు గుడికి దగ్గరలో దిగారు. నడకతో, కాళ్ళు వాచి కాటేజిదాకా రాలేకపోయానక్కా."

లక్ష్మణమూర్తి శ్రీనాథుని చూచి పలకరింపుగా తలవూగించాడు.

వైదేహి కారులోనుండి లడ్డూలు తెచ్చి ఇద్దరికీ ఇచ్చింది.

ప్రసాదం తీసుకున్నారు.

"డబ్బులిస్తాము - అమ్మా ప్రసాదం అమ్ముతారా ?" ఎవరో వైదేహిని అడుగుతున్నారు.

సాభిప్రాయంగా భర్త వైపు చూచింది వైదేహి.

లక్ష్మణమూర్తి వారితో బేరమాడుతున్నాడు.

'సాయంత్రమన్నా రండి కాటేజికి' వైదేహి మళ్ళీ అర్థించింది.

అలాగేనని తల వూపింది తాయారు.

వైదేహి కారెక్కింది.

కారు సాగిపోయింది.

ధర్మదర్శనాలు మళ్ళీ ప్రారంభమైనాయి.

"ఏడుకొండలవాడా ! వెంకటరమణా! గోవిందా గోవిందా !"

శ్రీనివాస దివ్య అవతార గాథావివరణాత్మక చిత్రాలతో స్థగితమైన కుడ్యాంతరం నుండి సుదీర్ఘమైన క్యూ ప్రవాహంలా సాగుతున్నది.

ఈశ్వరాభిముఖంగా పయనించే భక్తిరస ప్రవాహం మధ్య వికసించిన కమలాల్లాగా కొన్ని వందలమంది శ్రీనాథులు, తాయారులు- మల్లయ్యలు-

కొన్ని తెల్ల కమలాలు- కొన్ని ఎర్రని కలువలు- మరికొన్ని నల్ల కలువ పూలు-

"ఆపద్బాంధవా- అనాథరక్షకా- గోవిందా, గోవిందా."

శ్రీనాథుడు స్వామివారి దివ్య మంగళ విగ్రహ సాన్నిధ్యానికి పత్నీ సమేతుడై చేరాడు-

తన అపాంగంద్వారా విశ్వాన్ని శించితం చేస్తున్న సర్వశక్తి సమన్వితుడైన దయామూర్తి-

కల్యాణధాముడు-

శ్రీనివాస వరదుడు-

తాయారు భక్తి ప్రవాహంలో తలమునకలైంది- శ్రీనాథుని హృదయంలో స్వామి ప్రతిబింబిస్తున్నాడు- అద్దంలో, జ్యోతిలా-

"స్వామి నాకు సమస్త ఐశ్వర్యాలనూ ప్రసాదించు- సుపుత్ర ప్రాప్తిని కలిగించు- నా భర్తను అర్థార్థిగా మార్చు- అర్థమంటే శబ్దార్థం కాదు- ధనం స్వామీ ధనం-"

"నడవండి- నడవండి" అర్చకులు పంక్తిని తొందర పెడుతున్నారు.

శ్రీనాథునికి అమృతపానంలో ఎవరో చెయ్యి అడ్డం పెట్టినట్లనిపించింది- బయటకు నడిచాడు నిశ్శబ్దంగా.

x x x x

మంగతాయారు తీర్థయాత్ర సఫలమైందన్నట్లు ఆమెకు నెలతప్పింది- శ్రీనాథుడు సంతోషించాడు.

"మన ఇంట్లో ఓ చిన్న శశి ఉదయించబోతున్నది" అన్నది తాయారు.

"శశి కాదు శశం - ఓ కుందేలు పిల్ల పుడుతుంది." గునగునలాడుతూ అన్నాడు శ్రీనాథుడు.

"ఇలా రండి"

"ఏమిటి" దగ్గరగా వెళ్ళాడు.

"నాదో చిన్న కోరిక."

"ఏమిటి??"

"నాకు పుట్టే బిడ్డడిని జంతువుల పేర్లతో పక్షుల పేర్లతో పిలవడానికి వీలులేదు."

"తాయారూ సృష్టిలో అవే చాలా అందమైనవి కదా!"

"అంటే మానవుడు కాదా! సింహమెన్నడన్నా 'నరధీరా!' అని పిలుచుకుంటున్నదా! ఆడసింహాన్ని 'నారీమధ్యా' అని సంబోధిస్తున్నదా! క్రూరమైన అడవి జంతువులనూ నీచు తినే మృగాలనూ కోళ్ళనూ కొక్కరాయిలనూ గొప్పవాటిని చేసి వాటితో నరులనూ పోలుస్తూ ఇదేదో ఉత్తమజాతి కవిత్వమని భ్రమింపజేస్తారా? సిగ్గులేదండీ మీ కవులకు మానవుడి నిలా కించపరచడానికి."

"తాయారూ - చర్చవద్దు కాని సృష్టిలో ఒక్కో జీవజంతువుకు ఒక్కొక్క అందం వుంది. రేఖా మాత్రమైన ఆ ఒక్కొక్క సౌందర్యాన్ని మానవుడి ఒక్కొక్క అంగానికి ఆపాదించడం మానవుడు సర్వోన్నతమైన వాడని నిరూపించడమే కవుల తాత్పర్యం."

"ఈ శాస్త్రాలూ అలంకారాలూ నాకు తెలియవు. నా బిడ్డడిని అసలు కవిని చేయడానికే వీలులేదు. హాయిగా ఏ డాక్టరునో ఇంజనీరునో చేయాలి. వెర్రి మొర్రి కవిత్వాలతో చెట్లూ పుట్టలూ పట్టి తిరగకుండా యధార్థ లోకంలో బ్రతుకుతాడు. దోసెళ్లతో సంపాదించుకుంటాడు."

"తాయారూ! కవి ఘనతను గుర్తించేందుకు నీ జన్మ చాలదు - అర్థ జీవనం శబ్దాన్ని దిగమింగుతుందనే భయంతో పేదవాడుగా జీవిస్తాడు దారిద్ర్యాన్ని కోరి వరిస్తాడు. కుక్కిమంచంలో సాలెగూళ్ళమధ్య పడివుండి భావ సౌధాలు నిర్మించి మానవాళికి కానుకగా సమర్పిస్తాడు - నా కొడుకు కవి కాగలిగితే అది పూర్వజన్మ పుణ్యఫలమనుకుంటాను."

తాయారు కోపంగా వెళ్ళిపోయింది.

అంతటితో ఆ సంభాషణ ముగిసింది.

తమ ఇంట్లోకి మూడో జీవి ప్రవేశిస్తుండగానే తాయారుకు ఆర్థికమైన భయం పట్టుకున్నది

చాలీచాలని ఈ ఆదాయంతో సంసారం ఎలా చేయడం??

తెలుగుదేశంలో కవిత్వానికి విలువ తక్కువ.

మహాకవులకు గుర్తింపు శూన్యం-

బ్రతికినవాళ్ళను చచ్చేవరకూ తిట్టి చచ్చిన తర్వాత సన్మానాలూ వర్థంతులూ చేస్తారు.

ఇదేం ఇంగ్లీషు దేశం కాదు పుస్తకాలమీద బ్రతకడానికీ కోట్లు సంపాదించడానికి-

అయినా తన భర్త కవి అని నమ్మకమేమిటి??

"నీ ముఖం చంద్రుడిలా వుంది - నీ గొంతు కోయిలలా వుంది" అంటూ వేల సంవత్సరాల పాత చింతకాయ పచ్చడినే మళ్ళీ మళ్ళీ ప్రయోగిస్తూ మనుషుల ప్రాణాలు తీయడం కవిత్వమా? నన్నయ్యకు రాజరాజు గుర్తింపు వుంది.

శ్రీనాథుడికి రెడ్డిరాజులు శరణుజొచ్చారు.

పెద్దన్నకు రాయలవారు దాసోహమన్నారు.

వెంకన్నను రఘునాథుడు ఇందిరా మందిరానికి పట్టాభిషేకం చేశాడు.

తన భర్త అలాంటి కవా?

అయితే ఈ ముష్టి ఖాదీ శాలువలేమిటి?

ఒక్క రచనకూ బహుమతి ఎందుకు రాలేదు?

ఒక్కచోట వెయ్యినూట వదహార్లిచ్చి ఎందుకు ఏనుగు నెక్కించలేదు??

తాయారు తన భర్త కవికాడనీ కేవలం ఒక రకమైన చపల చిత్తుడనీ నిశ్చయించుకున్నది.

అందుకే బంధువుల్లో ఎవరైనా 'మీ ఆయన కవిట కదా!' అన్నా 'మీవారి కవిత్వం నేను చదివాను చాలా బాగుంది.' అన్నా సిగ్గుపడటం మొదలు పెట్టింది.

తాయారుకు ఏడవ నెల వచ్చింది.

శ్రీనాథుని ప్రకృతి పూజలో కించిత్తయినా మార్పు రాలేదు.

పుట్టింటివారు శ్రీమంతానికి తీసుకువెళ్ళారు కూతురినీ, అల్లుడినీ.

శ్రీనాథుడు భార్య ముచ్చట తీర్చడంకోసం బయలుదేరాడు.

చిలకలూరిపేటకు బస్సు ప్రయాణం.

రామానుజస్వామీ పేరిందేవీ కూతురిని అల్లుడినీ ఆదరంగా చూచారు.

సంప్రదాయానుసారం వైష్ణవ పూజలూ వగైరా జరిపించి శ్రీమంతానికి ఊళ్ళో అందరినీ పేరంటానికి పిలిచారు. రేపు శ్రీమంతమనగా అకస్మాత్తుగా హైదరాబాదునుండి లక్ష్మణమూర్తీ, వైదేహి వచ్చారు.

పేరిందేవి పరమానంద భరితురాలైంది.

తిరుపతి వెళ్ళినప్పుడు కూడా పేట మీదుగా వెళ్తూ ఆగలేదు.

లక్ష్మణమూర్తయితే అసలు రానేరాడు.

ఈసారి కూడా వచ్చేవాడు కాదనీ గుంటూరులో వైన్ కాంట్రాక్టు ఒకటి వుండి బయలుదేరాడనీ చెల్లెలి శ్రీమంతం వార్త, జాబు చేరి వుండటం వల్ల తను కూడా వస్తానని పట్టుబట్టిందనీ చెప్పింది వైదేహి.

"నీవు రావడంతో నిజంగా ఇది నాకో పండగయింది అక్కయ్యా" అన్నది మంగతాయారు.

రామానుజస్వామి శ్రీనాథుడితో ఆత్మీయునిలా వ్యవహరించాడు. కవిత్వాన్ని గూర్చి వేదాంతాన్ని గూర్చి చర్చలు జరిపాడు కాని లక్ష్మణమూర్తితో ఒక ఆఫీసరుపట్ల చూపినట్లు గౌరవం చూపాడు. ఒక అధికారికి జరిపిన లాంఛనాలు జరిపాడు.

ఆ భేదం గమనించింది మంగతాయారు.

మంగతాయారు మనస్సును మాటల్లోకి అనువదించుకున్నాడు శ్రీనాథుడు.

"గౌరవింపబడటం కన్నా ప్రేమించబడటం గొప్పదన్న విషయం తాయారుకెలా తెలుస్తుంది?" అనుకున్నాడు.

లక్ష్మణమూర్తి పెద్ద చదువుకున్నవాడు కాదు. అలాంటప్పుడు ఆయనతో శ్రీ భాష్యం వగైరా తనతో ముచ్చటించినట్లు మామగారెలా ముచ్చటిస్తారు? పైగా లక్ష్మణమూర్తి ధనవంతుడు.

డాబూ దర్పం కలవాడు.

కొంచెం ముక్కోపి కూడాను.

కాబట్టే తదనుగుణంగా ప్రవర్తించవలసిన బాధ్యత అత్తమామలపై వుందని శ్రీనాథుడికి తెలుసు.

కాని మంగతాయారుకు తెలియదు.

మర్నాడు గాజులు వేయించారు.

తొమ్మిది రంగుల గాజులూ నవరసాలను పలికించాయి - తొణికించాయి శ్రీనాథుని ఎదలో-

'నా బిడ్డ రసస్వరూపుడు కావాలి - శబ్ద బ్రహ్మోపాసకుడు కావాలి' అని సంకల్పించాడు ఆ ముహూర్తాన.

ఆరోజు సాయంత్రం ఉన్నట్టుండి సుడిగాలి వచ్చింది-పేటలోని పొగాకు కేంద్రాలలో పరదాలూ రేకులూకూడా కొట్టుకొనిపోయాయి.

అందువల్ల పేరంటం అనుకున్నంత వైభవంగా జరుగలేదు - ఎక్కువ మంది పేరంటాండ్రు రానేరాలేదు - పైగా వైదేహికి చేసిన సీమంతంలా ఇది లేదని ఎందుకో అనిపించింది తాయారుకు.

అదే ఆత్మీయత అదే అనురాగం-

కాని ఆ అంతస్థు వేరు ఈ అంతస్థు వేరని తోచింది - 'అక్క పెద్దది - పైగా మొదటిసారి-అప్పుడు నాన్నకు సంపాదన ఇంకా బాగుండేది' అని తృప్తి పడాలని ప్రయత్నించినా తాయారుకు మనస్సు కుదటపడలేదు. సమాధానపడ లేదు - 'నా భర్త మా బావకన్నా తక్కువ అంతస్థు కలవాడు. అందుకే ఈ తేడా' అని ఆమె హృదయంలో ఏదో ఒక శక్తి ప్రతిధ్వనించడం మొదలు పెట్టింది. తమ ఆర్థికమైన న్యూనత వల్లనే సీమంతం వైభవోపేతంగా జరగ లేదనే ఒక భావం సుడిగాలిలా ఆమెలో చెలరేగింది.

సుడిగాలి పెరిగి పెరిగి తుఫానుగా పరిణమించింది. లక్ష్మణమూర్తి ఆ రాత్రే తన కారులో బయలుదేరి తెల్లవారేలోపల హైదరాబాదు చేరాలనుకున్నాడు గాని వానవల్ల గత్యంతరంలేక ఆగిపోయాడు.

మామగారిదగ్గర అల్లుళ్ళిద్దరూ కూర్చున్నారు.

లక్ష్మణమూర్తి తన ఘనతనూ, పట్టణ జీవితాన్ని, నగరంలోని వాననూ వివరిస్తున్నాడు-

తాను బొంబాయి వెళ్ళినప్పుడు వర్షం ఎలా వుండేదీ చూచినట్లు చెప్పాడు. కలకత్తాలో వర్షం విచిత్రంగా వుంటుందట. అందులోనూ హౌరా బ్రిడ్జిదగ్గర సాయంకాలం వానను చూచి తీరాలిట. వర్షాకాలం రాత్రి బెంజారాహిల్స్ ఎలా వుంటుందో వివరించాడు - త్రీ ఏసెస్ సౌందర్యం, రిడ్జి మాధుర్యం వానలో ఎలా ద్విగుణీకృతమూ త్రిగుణీకృతమూ అవుతుందో చెప్పాడు - పారిస్‌లో వాన, శాన్ ఫ్రాన్సిస్కోలో వర్షం కురిసిన రాత్రిలో, గోల్డెన్ గేట్ బ్రిడ్జి - ఇలా వర్ణిస్తున్నాడు.

శ్రీనాథుడు అంతా విన్నాడు.

రామానుజస్వామీ నిశ్శబ్దంగా సాక్షీ మాత్రంగా కూర్చున్నాడు. అంతా విని శ్రీనాథుడు అన్నాడు "అన్నయ్యగారూ మీరు, కవి కావలసింది పొరపాటున సారాయి దుకాణం పెట్టారు" శ్రీనాథుడు చాలా సరళంగా అన్న ఈ మాటకు లక్ష్మణమూర్తి ఎంతో అవమానంగా భావించాడు.

కావాలని తన్ను కించపరచాలని శ్రీనాథుడు ప్రయత్నిస్తున్నాడని అనుకున్నాడు.

దానితో చిర్రెత్తిపోయాడు.

వానలా విజృంభించాడు.

"కవిత్వమేమిటయ్యా కవిత్వం - అదేం పెద్ద విద్యనుకున్నావా? మాటలను నిలువునా అడ్డంగా నవారు మంచంలా అల్లడం. జనపనారలా పేనడం. ప్రతి ముష్టివాడూ కవే ఈనాడు. ఏమన్నా శ్రమ పడాలా? తెలివితేటలుపయోగించి డబ్బు సంపాదించాలా? తిని తిరిగే సోమరిపోతులంతా కవులమని చెప్పుకుంటారు. అందుకే కొన్ని దేశాల్లో కవిత్వాన్ని బహిష్కరించారు. అంతా ఒళ్ళు వంచి చాకిరీ చేయాల్సిందే. కష్టపడి ఏదో ఒక పని చేసుకొని బతకాల్సిందే. కవిత్వం వ్రాస్తామంటే కాల్చేస్తారు వాళ్లు"

"అన్నగారూ. మీ నగరంలోని వర్షవర్ణన ద్రాక్షపాకంలా సాగింది. అందుకని అలా అన్నాను" శ్రీనాథుడు మరికొంచెం వివరించాడు.

"ఛీ- ఇక మాట్లాడకు' చివాలున లేచి లోపలికి పోయాడు లక్ష్మణమూర్తి. వైదేహి ఈ సంఘటనతో తల్లడిల్లిపోయింది. మంగతాయారు కళ్ళు బయటి మేఘాలకు అక్కలుగా మారాయి.

రామానుజస్వామి శ్రీనాథుణ్ణి ఏదో సముదాయించబోయాడు.

శ్రీనాథుడు ఏమీ అనలేదు. అనుకోలేదేమో కూడా!

వైదేహి మాత్రం అన్నది "ఎవరిపని వారికి గొప్పది. శ్రీవైష్ణవులమై వుండి వైన్‌షాప్ నడుపుతున్నామనేకదా మా మరిది ఇలా 'సారాయి దుకాణం' అని ఎగతాళి చేశాడు. ఎవరి అంతస్థుల్లో వాళ్లుంటే ఇలా గొడవలేరావు."

మంగతాయారుకు రోషం పొడుచుకొచ్చింది. "ఇంకా సిగ్గులేక ఆ దుర్మార్గుణ్ణి వెనుకేసుకు వస్తున్నావా అక్కయ్యా. నీ మొగుడైతే నీకు గొప్ప. నాకేం గొప్ప! నలుగురు పెద్దమనుషుల్ని పిలిపించి మా ఆయన అన్నమాట వినిపించు. అందులో ఏదైనా తప్పుంటే నా నోట్లో గడ్డిపెట్టు. 'ద్రాక్షపాక'మంటే నీ అనాబ్‌షాహీ తోటలు కావు. కవిత్వంలో ఒక శైలి. ఆ విషయం అర్థంచేసుకోకుండా 'ఛీ - మాట్లాడకు' అంటే ఏమిటి - మేమేం మీ ఇంటి కుక్కలనుకున్నావా? ఏం చూసుకుని ఆ బోడి గర్వం - హిమాయత్ నగర్‌లోని మేడ చూసుకునేనా?"

తాయారు మాటలతో వైదేహి కంపించిపోయింది - ఆమె కళ్ళు సజలాలైనాయి.

పేరిందేవి తాయారును కసురుకున్నది.

'అంతరం లేకుండా మాట్లాడకు' అన్నది పేరిందేవి.

'ఏం అంతరమే. డబ్బు అంతరమేనా' తాయారు రెట్టించింది.

పేరిందేవి వయస్సు అంతరాన్ని ఉద్దేశించి ఆ మాట అన్నది - కాని తాయారుకు డబ్బు అంతరమే స్ఫురించింది.

లోపలినుంచి లక్ష్మణమూర్తి వచ్చాడు 'అవునమ్మా - డబ్బు అంతరమే. కష్టించి రాత్రిబవళ్ళు తోటలువేయించి బేరాలుచేసి డబ్బు సంపాదించాము-బఫూనులా తిరిగితే డబ్బురాదు - అంతరాలు తెలియవు.'

'బఫూను' అన్నమాట తన మనస్సులోని పిట్టలదొర అన్న మాటకు పర్యాయపదంగా తాయారుకు గోచరించింది. తాయారు ఏడుస్తూ అన్నది' నా భర్త అసమర్థుడు కాబట్టే ఇన్నిమాటలు పడవలసి వస్తున్నది - నా బంగారం మంచిదైతే ఇతరులననుకొనే పనేమిటి? బ్రాహ్మణుడై పుట్టి సారాయి వ్యాపారం చేస్తూవుండే అడ్డమైన తాగుబోతులచేతా మాటలు పడవలసి వచ్చింది నా బ్రతుకి....'

పేరిందేవీ రామానుజస్వామీ ఈ అకాల పుష్కలావర్త ప్రళయ ధ్వనికి తట్టుకోలేకపోయారు.

భర్త ఆజ్ఞానుసారం మరో పది నిమిషాల్లో వైదేహి బట్టలు సర్దుకొని కారులో కూర్చున్నది.

లక్ష్మణమూర్తి వెళ్ళి ముందు సీటులో కూర్చున్నాడు, జోరున వాన - అయినా,

వాళ్ళని ఆపగలిగే ధైర్యం అత్తమామలకు లేకపోయింది.

శ్రీనాథుడు దగ్గరికి పోయాడు.

"క్షమించదన్నయ్యగారూ నేను వాచ్య వ్యంగ్యాలలో ఏదైనా తెలిసో తెలియకో ప్రయోగించినట్లయితే - రేపు వెళ్ళవచ్చు - దయచేసి రండి."

ఓ చీమనో దోమనో చూచినట్లు చూచాడు లక్ష్మణమూర్తి శ్రీనాథుణ్ణి.

బురద చిమ్ముకుంటూ కారు బయలుదేరింది.

శ్రీనాథునిపై బురదనీళ్లు చిందాయి....

చూస్తూండగానే కారు చీకట్లో కలిసిపోయింది.

ఆరోజు రాత్రి ఎవ్వరికీ భోజనాలు లేవు. పేరిందేవి శ్రీనాథుణ్ణి భోజనానికి పిలిచింది కాని రాలేదు.

రాకరాక వచ్చిన బిడ్డ ఇలా అవాంతరంగా వెళ్ళడంతో రక్తపోటు మనిషి పేరిందేవి తట్టుకోలేకపోయింది. తెల్లవార్లూ సణుగుతూనేవుంది. "ఈ శ్రీమంతం లేకపోయినా నా బిడ్డ ఇలా వానలో వరదలో వెళ్ళవలసి వచ్చేదికాదు."

శూలాలతో కుమ్మినట్లనిపించింది తాయారుకు. మర్నాడే ఈమని ప్రయాణం కట్టింది. రామానుజస్వామి నివారించాడు.

కాని కట్టలు తెగిన ఉద్రేక పవాహాలను గరికపోచలు ఆపగలవా?

x x x x

అత్తగారింట్లోనే మంగతాయారు పురుడు పోసుకున్నది.

మగబిడ్డను కన్నది.

శ్రీనాథుడు ఉప్పొంగిపోయాడు.

తిథీ వారం నక్షత్రం అన్నీ బ్రహ్మాండంగా ఉన్నాయి. మహా ధనవంతుడూ కీర్తివంతుడూ అవుతాడు. ఆ ముహూర్తాన పుడితే జాతక ప్రకారం.

"మరి కవిత్వం మాటేమిటి??" అన్న ప్రశ్నకు జ్యోతిష్యం సమాధానం చెప్పలేదు.

దొరువుల్లోనుండి ఇన్ని కలువపూలు కోసుకొని వచ్చాడు శ్రీనాథుడు.
తల్లినీ పిల్లనూ చూచి నవ్వాడు.
తాయారు సిగ్గుతో తల వంచుకుంది.
తాను తెచ్చిన కలువపూలు పిల్లవాడిపక్కన పెట్టాడు.
"ఏమిటివి?" తాయారు ప్రశ్నించింది సూటిగా.
"ప్రకృతి ఈ శుభముహూర్తాన పంపిన కానుక"
తాయారు శ్వేతకమల నేత్రాలు అరుణ కమలాల్లా కనిపించాయి.
కలువలను పక్కపైనుండి నెట్టివేసింది.
శ్రీనాథుని హృదయం చివుక్కుమన్నది.
"ఇదిగో చూడండి. మీరింకా పసిపిల్లలుకారు మీకొక పసిపిల్లడు కూడా పుట్టాడు. ఇలా తేనెటీగలనూ సీతాకోకచిలుకలనూ పట్టుకొని తిరిగితే భుక్తి కూడా గడవదు. ఈ పూలరంగడి వేషాలు ఇక మానివేయండి. నన్నిక నలుగురిలోనూ తలెత్తుకొని తిరగనివ్వడి". కసురుకుంది ఆమె.
ఆమె నేత్ర కమలాలనుండి రెండు మూడు మంచుబొట్లు రాలి శ్రీనాథుడు తెచ్చిన చలువ కలువను వేడెక్కించాయి.
శ్రీనాథుని గుండె బరువెక్కిపోయింది.
తనొక అసమర్థుడు.
పనికిమాలినవాడు - పిచ్చికవి!
కవిత్వంపేర లోకంలో అవమానాలకూ అనాదరణకూ అవహేళనకూ ప్రతినిధిగా తయారైనాడు.
కలకంఠి కంట కన్నీరు తరుచు ఒలికించి సిరిని ఇంట నిలువకుండా చేసుకుంటున్న మూర్ఖుడు తాను.
సమాజం చాలా విస్తృతమైంది.
అందరూ ఒకే వృత్తి చేయడం సాధ్యపడదు.
కొందరు తాజమహళ్లు కడితే మరికొందరు మాటల మందిరాలు నిర్మిస్తారు.
కాని తన భార్య దృష్టిలోనేకాదు లోకం దృష్టిలోకూడా ఇంజనీర్లు గొప్పవారు, డాక్టర్లు అవతారమూర్తులు - ఆటమిక్ ఎనర్జీ మహావిద్య - అవన్నీ కాదనడంలేదు తాను - కాని శబ్దాలు సృష్టించే విద్యుత్తు అణు విద్యుత్తుకన్నా గొప్పదని నిరూపించదలచాడు - కాని విఫలమౌతున్నాడు.

ఆదర్శ శిఖరాల అంచులు అందుకోకముందే, అంబరాన్ని చూపించక ముందే పదవిహీనుడౌతున్నాడు

చ్యుతిని పొందుతున్నాడు-

"బిడ్డణ్ణి అన్యాయం చేయకండి - బిడ్డణ్ణి అన్యాయం చేయకండి- సమాజంలో నలుగురిలా నన్నూ తలెత్తుకొని తిరగనివ్వండి. బిడ్డణ్ణి అన్యాయం చేయకండి- అన్యాయం చేయకండి- అన్యాయం చేయకండి-అన్యాయం........"

x x x x

"ధన- ధన- ధన- ధన- ధన- ధన- ధన" ప్రింటింగ్ మిషన్ మోత.

"గుర్ గుర్-గుర్-గుర్-గుర్-గుర్-గుర్-గుర్-గుర్" చక్రాల శబ్దాలు.

'ఛుస్‌స్‌స్‌స్‌స్‌స్‌స్‌స్‌స్‌స్‌స్' బెల్టు ధ్వని-ఆనందవర్ధనుడి "ధ్వని"ని నేటి వరకు ఉపాసించే శ్రీనాథుడు తెనాలిలో ప్రింటింగ్ ప్రెస్ పెట్టాడు.

మొదట్లో కొన్నాళ్లూ రోజూ ఉదయం తొమ్మిది గంటలకు ఈమని నుండి బయలుదేరి తెనాలి చేరి పని ముగించుకొని తిరిగి రాత్రికి ఇల్లు చేరేవాడు. కాని క్రమంగా పని ఎక్కువకావడం మొదలుపెట్టింది. లంక ఈతకూ ఏటి మేతకూ కుదరదని తెనాలిలోనే ఓ ఇల్లు అద్దెకు తీసుకున్నాడు-

తొలిసారి మురికినీటి వాసనలకు గురి అయినాడు- కొడుకు ముద్దుకృష్ణతో బాటు ప్రెస్ కూడా దినదిన ప్రవర్ధమానం కాజొచ్చింది.

మొదట్లో చిన్నచిన్న జాబ్‌వర్క్సు మాత్రమే తీసుకునేవాడు- పెండ్లి శుభలేఖలు, కరపత్రాలూ ఇత్యాదులు. రాత్రింబవళ్లు కష్టపడి లాభాలు సంపాదించి ఒక ట్రిడెల్ కొన్నాడు. దానిమీద వారపత్రిక ఒకటి కాంట్రాక్టుకు ముద్రించడం మొదలుపెట్టాడు -

అలివేలిమంగా ప్రెస్ చూస్తుండగానే స్థిరపడిపోయింది - పని విషయంలో మంచి నైపుణ్యం ప్రదర్శిస్తారనే పేరు వచ్చింది -

ఎవరైనా శుభలేఖలు తెచ్చి ఇస్తే శ్రీనాథుడు వెంటనే ముద్రించేవాడు కాదు -

పిల్ల గూర్చి పిల్లవాని గూర్చి వివరాలు విచారించేవాడు - వారి శరీర వర్ణాలూ అభిరుచులూ కనుక్కొని "వారికి ఆరంజ్ అట్ట వుండి పైన శివపార్వతుల బొమ్మ వున్న కార్డులు తెచ్చుకోండి- అచ్చు వేస్తాను" అనేవాడు -

"మీవాడి అభిరుచికి విఘ్నేశ్వరుడి బొమ్మ గల కార్డులు చాలా శ్రేష్ఠం."

"మీ అబ్బాయి రాధాకృష్ణుడయ్యా - పోయి రాధాకృష్ణులున్న చిత్రం తీసుకురా బాబాయ్" ఇలా వరుసలు కలిపి వర్ణ వైచిత్ర్యాన్ని రసంతో సమన్వయించి ముద్రణ దగ్గర శ్రద్ధ తీసుకునేవాడు.

శ్రీనాథుడు తానీ లౌకిక ప్రపంచంలో ఎలా నెగ్గుకురాగలనా ? అని చాలా భయపడ్డాడు కాని ఇంత లౌక్యంతో బేరం నిర్వహించటం బాగా స్థిరపడ్డ పెద్ద పెద్ద ప్రెస్సులవారికే ఆశ్చర్యాన్ని కలిగించింది - శ్రీనాథుడు కవి కావడంతో మరి కొన్ని సౌకర్యాలు పెరిగాయి -

ఎండాకాలం మూడు నెలలూ గుంటూరు జిల్లాలోని పెండ్లి పత్రికలు సగానికి సగం అలివేలుమంగా ప్రెస్‌కే వచ్చేవి. కారణం తన దగ్గర పెళ్ళి శుభలేఖలు వేయించుకున్న ప్రతీ వధూవరులమీదా పంచరత్నాలు వ్రాసి ఉచితంగా న్యూస్‌ప్రింట్ మీద అచ్చు వేసి పంపించేవాడు - శ్రీనాథుని వాక్కు అమృతవాక్కనీ అతని దీవెన పురోహితుడు పెట్టిన ముహూర్తంకన్నా దివ్యంగా పనిచేస్తుందనీ ఒక నమ్మకం వ్యాపించింది.

ఎలా వ్యాపించింది - ఎవరు వ్యాపింప చేశారు ? ఈ రహస్యాలేవీ తెలియవు కాని ఒక విశ్వాసం ప్రబలంగా అందరిలోనూ నాటుకున్నది.

పెండ్లి శుభలేఖలయితే అలివేలుమంగా ప్రెస్‌కు పోవలసిందే ! ! రాజకీయ మిత్రులందరికీ శ్రీనాథుడు తక్కువరేట్లకే కరపత్రాలు వేసిపెడతాడు.

శ్రీనాథుని ప్రెస్‌లో ముద్రణ అయిన పుస్తకం నెల తిరగకముందే పునర్ముద్రణకు వస్తుంది.

పాఠకులు పకోడీల్లా కొనుక్కొంటారు - ఫలానా పుస్తకం అచ్చుకాక ముందే ప్రీ పబ్లికేషన్ ప్రతులే రెండు వేలు అమ్ముడుపోయాయి.

శ్రీనాథుడు ప్రయోగించిన మరో మాయ జగన్మోహినిగా నర్తించింది.

గల గల గల గల కనకవర్షం కురిసింది -

'అంతా నా ముద్దుకృష్ణుడి అదృష్టం" అనుకున్నది మంగతాయారు.

ఆదాయంతో బాటు ఖర్చులు పెరిగాయి -

ప్రెస్ పెరిగింది -

ఇంటి స్థలం ఒకటి కొన్నాడు -

స్థలం కొన్నాక ఇటుకలు -

ఆ పైన సున్నం - కలప - ఇనుపపామాను - పని పెరగడంతో దగ్గర బంధువు నరసింహాచారిని మేనేజరుగా పెట్టుకున్నాడు.

'నరసింహంగాడి బుద్ధి మంచిదికాదు - తినేస్తాడు' అన్నది తాయారు.

"తింటే తిన్నాడు- మనవాడేగా- అలాగని పని ఇవ్వలేదనుకో. మనకు ఐశ్వర్యం కలిసి వచ్చిందని, వచ్చి తిష్టవేసి ఇంట్లో కూర్చొని తింటుంటే, ఊరికే, అప్పుడేమయింది?" అన్నాడు శ్రీనాథుడు-

నిజమే ననిపించిందితాయారుకు.

డబ్బుతోబాటు తాయారుకు బంగారంమీద మోజు పెరిగింది.

ఎన్ని యుగాలు మారినా విలువ తగ్గనిది బంగారం ఒక్కటేనని కాసులు కొని సొమ్ములు చేయించాడు శ్రీనాథుడు. ఈమనిలో ఇల్లును బాగుచేయించు కున్నాడు.

ఇంకొంచెం పొలం-

మరికొంచెం ఆస్తి-

"ఈ ముష్టి పొలంతో నాకు తృప్తిలేదు. రాజధానిలో,మలక్ పేట కవతల అనాబ్ షాహీ తోట తీసుకోవాల్సిందే! పోటీగా పంట పండించి'కృషి పండిట్' అనిపించుకోవాల్సిందే-లక్ష్మణమూర్తి కళ్లు కిందికి దిగితే తప్ప నాకు మనశ్శాంతి లేదు" అని ద్రౌపదిలా ప్రతిజ్ఞ పట్టింది తయారు.

శ్రీనాథుడు చిరునవ్వు నవ్వాడు.

ఇప్పుడు పూర్వంలా శ్రీనాథుడు సకాలానికి భోజనానికి రాడు. వచ్చినా తీరికగా రుచులు రుచులుగా భోంచేయడు. గబగబా నాలుగు ముద్దలు తిని లేస్తాడు.

"మరికొంచెం మోర్ కొళంబు వడ్డించుకోండి" అంటే "పిల్లేదు అవతల రచయిత ఆవిష్కరణ తేది ఫిక్స్ చేసుకున్నాడు రాత్రికి రాత్రి ఇంకా రెండు ఫారాల పని ముగించి కటింగ్, బైండింగ్ ముగించాలి" అని ఓ పంచె భుజాన వేసుకొని పరుగెత్తుతాడు.

ఒక్కొక్కప్పుడు అన్నం ముందు కూర్చుంటే తమాషాలు ఏదో చెపు తాడు - ఆ తమాషాలన్నీ ప్రెస్ గూర్చే - "క్షామ నివారణ' అని అచ్చుకొడితే

మిషన్ ప్రూఫ్ తర్వాత, అందులో 'ష' వత్తు రాలిపోయి "కామ నివారణ" అని అచ్చు పడిందట - 'సకుటుంబ సపరివార సమేతంగా' అనడం తప్పయ్యా' అంటే ఒక రైతు విననే వినడట ! వాళ్ళ వూళ్ళో పురోహితుడు పసుపు పూసిన కాగితంమీద అలాగే వ్రాసి ఇచ్చాడట - 'అబ్బ మిషను వాడివి - నీకేం తెలుసు మా పురోహితుడికన్నా" అని దెబ్బలాడతాడట !

ఒక రాజకీయ నాయకుడికి బాగా సుస్తీ చేసిందట - ముందే సంతాప సందేశమూ జీవిత చరిత్ర కలిపి ఒక సంస్థ వాళ్ళు గత రాత్రే అచ్చు వేయించారట -

"అవి అయన పోయేవరకూ ప్రెస్ నుండి బయటకు పోకూడదు - పోయి నయ్యా ఈ సంస్థ వాళ్ళని ప్రజలు చితకబొడుస్తారు సున్నంలోకి ఎముకలేకుండా" ఫక్కున నవ్వాడు శ్రీనాథుడు.

"ఏమేయ్ -" అరుస్తూ వస్తాడు శ్రీనాథుడు పీధిలోనుండే.

"నరసింహంగాడు నిన్న రాత్రి సినిమాకు చెక్కేశాడు - ఓవర్ టైం ఉండాలిరా అంటే వినలేదు - ఏం చేయాలి వెధవను - మేనేజరు ఉంటేనే అంతంత మాత్రం వాళ్ళు - లేకుంటే ఇక చెప్పేదేముంది ? ? మళ్ళీ ఈ రాత్రి కూడా ఓవర్ టైం పెట్టాల్సిందే - ఖర్మ - గ్రహచారం ఏం చేస్తాం."

"అసలు ఓవర్ టైం ఎందుకండీ."

"ఎందుకా నా అదృష్టం బాగుండక - ఆ నరసింహంగాడు కంపోజిటర్ల చేత సరిగ్గా పని చేయించక - పుల్లయ్యలేడూ పుల్లయ్య అదే, పాపమని తిండికి లేకపోతే పని నేర్పి ముందు 'గాలీ'కి ఇంతని 'పే' చేసి తర్వాత పర్మినెంటు పర్కరుగా తీసుకున్నాను చూడు, వాడు నిన్న ఇంత టైపు జేబులో పోసుకు పోయాడు- వాడి బొంద - ఇన్ని 'ల'లు ఇన్ని 'య'లు కొట్టేశాడు. వాడు 'లయం' కావడానికి -"

శ్రీనాథునికి విజయవాడలో ఒక సంస్థ సన్మానం చేసింది. వెళ్ళివచ్చాడు-

వచ్చేసరికి పత్రిక వెళ్ళవలసిన తేదీలోగా పని ముగించలేకపోయాడు నరసింహం-

పత్రికాధిపతి మండిపడ్డాడు.

"ఇదేం పత్రికనుకున్నారా? పాత చింతకాయ పచ్చడనుకున్నారా? సకాలానికి మార్కెట్‌లోకి పోకపోతే ఎవడు చదువుతాడయ్యా - మిమ్మల్ని నమ్ము

కొని కాంట్రాక్టు ఇస్తే నన్నిలా ముంచుతారా-చాలు చాల్లేవయ్యా-పెద్దమనుషులు-బుద్ధులుండక్కర్లా-" గంగరాజు మాటలు తూలుతున్నాడు - అయినా సకాలానికి పత్రిక ఇవ్వకపోవడం ఎంత తప్పో తనకు తెలుసు-శ్రీనాథుడు గంగరాజు కాళ్ళావేళ్ళా పడ్డాడు. 'బాబ్బాబూ ఈసారికి క్షమించండి - ఏదో పిల్లవాడు తెలియక తప్పుచేశాడు - ఇవి చేతులు కావు'.

గంగరాజు కొంచెం మెత్తబడ్డాడు-

"నేను నిన్ను క్షమిస్తాను శ్రీనాథుడూ - కాని నన్ను పాఠకులు క్షమిస్తారా చెప్పు - ఇలాంటి పిల్లల చేతనటయ్యా ప్రెస్సు నడిపిస్తావు నువ్వు '

నరసింహానికి కోపం పొడుచుకొచ్చింది-

"అనవసరంగా నన్ను మాటలనకండి-కావాలంటే కంపోజిటర్ల నడగండి. నిన్న రాత్రంతా కరంట్ పోయింది - అదీ నా తప్పేనా??"

"నోరు ముయ్యరా - ఎలుకకు పిల్లిసాక్ష్యం-నీకు కంపోజిటర్లా సాక్ష్యం?" శ్రీనాథుడు మందలించాడు కోపంగా-

నరసింహం రోషంగా ప్రెస్సునుండి బయటకు వెళ్ళిపోయాడు-

శ్రీనాథుడు ఇంటికొచ్చాడు-

ఆ పూట తిండే తినలేదు-

"లేవండి - అనుష్ఠానం త్వర త్వరగా ముగించి సాపాటుకు రండి."

"నాకు ఆకలిగా లేదు తాయారు-"

భర్త ఎవరిచేతనో మాటలు పడివుంటాడని గ్రహించింది తాయారు-

"ఉదయం ఇంటికికూడా రాకుండా అలాగే ప్రెస్‌కు వెళ్ళారేమిటి? ఏం సన్మానం జరిగిందండీ విజయవాడలో?"

"నా బొంద సన్మానం - బోడి సన్మానం-ముష్టి జరీ అంచుగల నూలు ఖండువా కప్పి ఓ ముప్పై మల్లెపూల దండలు వేశారు-ఏమిటిది? వాళ్ళు సన్మాన సభ పెట్టింది నన్ను గౌరవించడానికా పూల షాపులవాళ్ళను బ్రతికించడానికా? కిలో బియ్యం మూడు రూపాయల డెబ్బై పైసలు - కందిపప్పు ఐదురూపాయల ముప్పై పైసలు - నెయ్యి దానమ్మ కడుపుకాలా అసలు దొరకడమేలేదు నలభై రూపాయలు పెట్టినా-ఘన సన్మానమంటే ఇంకా ఏమిటో ననుకున్నాను ఘన మంటే మేఘమనే అర్థం వుందిలే. ఓ కుండెడు నీళ్ళు నెత్తినిపోసి పంపినట్లుంది

ఈ పూలదండలు ఎందుకు వేశారని - దండ ఐదు రూపాయలు - ముప్పై దండలేమిటి మరీ వెర్రి పట్టినట్లు-ఆ నూటయాభై రూపాయలూ రొఖ్ఖం ఇస్తే అర బస్తా ధాన్యం రాదూ - ఓ నెల ప్రెస్సుకు కరంటుబిల్లు కట్టనూ - ఛీ ఛీ అటు శరీర కష్టం - ఇటు ఆర్థిక నష్టం - ఆ చెత్త వెధవ మూలంగా గంగరాజు ఇవ్వాళ ప్రశయరుద్రుడై పోయాడు - పరపతికాస్తా బుగ్గిపాలౌతున్నది - తల ఎక్కడ పెట్టుకోవాలి నేనిక".

"సరేలెండి - ఈ గొడవ ఎప్పుడూ వుండేదే - లేవండి."

"నాకు తిండి అక్కర్లేదు - తాయూరూ."

శ్రీనాథుడు తిండి తినలేదు - ఓ గ్లాసు మంచినీళ్లు తాగి పిల్లవాడికి ఏదో మందు కావలసివుంటే ఇచ్చి ప్రెస్సు కాగితాలు కొన్ని బీరువానుండి తీసుకొని "ఈ సన్మానం-ముష్టి సన్మానం ముండ సన్మానం సభలోనే తిట్టివచ్చాను వాళ్లని" అంటూ వెళ్ళిపోయాడు - అంతే మళ్ళా మరునాడు మధ్యాహ్నమే కనపడటం.

పని ఎక్కువవుతున్నకొద్దీ డబ్బు ఎక్కువౌతున్నది.

డబ్బు పెరుగుతున్నకొద్దీ పని పెరుగుతున్నది.

పని పెరుగుతున్నకొద్దీ ప్రెస్సు పెరుగుతున్నది.

శ్రీనాథుడు యంత్రంలా పనిచేస్తున్నాడు-యంత్ర చక్రంలా, చక్రంలో ఒక మరమేకులాగా మారి పని చేస్తున్నాడు. డబ్బును 'మింట్' చేస్తున్నాడు.

పూర్వంలా భోజనంపట్ల శ్రద్ధ వహించడంలేదు.

నిద్రాసుఖాన్ని గూర్చి ఆలోచించడంలేదు.

"ఏమండీ నేనీ టెర్లిన్‌లో బాగున్నానా" అంటే "టెర్లిన్‌కేమి దాని క్రై పెట్టిన నూట ఎనభై అయిదు రూపాయలూ బాగాలేవా?" అంటున్నాడు.

ఇదే పూర్వమయితే "ఆకుపచ్చ టెర్లినులో నీవు సుందర నందన వన నికుంజాలమధ్య మణి మందిరాలలో తిరిగే శచీదేవిలా వున్నావని" ఓ అలంకారం ప్రయోగించేవాడు.

నీవు ధరించడంవల్ల చీరె విలువే పెరిగిందని వర్ణించేవాడు.

ఇప్పుడదేమీలేదు.

తాయారు ఆశ్చర్యపోయింది.

భర్త కేవలం యాంత్రికంగా మారుతున్నాడని గ్రహించింది.

ఆయన పెదవులమీద చిరునవ్వుల కోసం చుక్కాని వేసి వెదకడం ప్రారంభించింది.

కాని అవి మృగ్యమైపోయాయి.

నిన్న ఓ నవ్వు నవ్వాడు - కాని అది రసాత్మకమైన హాసం కాదు-తన ప్రెస్సుకు ఓ రచయిత వచ్చాడట - ఆయన బుక్కు అచ్చు వేయించుకున్నాడట. ఆయన వ్రాసిన ఈ పుస్తకం మొదటి ముద్రణ చెల్లిపోయిందట. గ్రంథ సమీక్షలు మాత్రం బాగా రాలేదట అందుకని రచయిత సమీక్షకులను తిడుతున్నాడట.

"వాళ్ళ మొఖం విమర్శ - ఇది విమర్శా? ఈ రచయితలో హెమింగ్వే ఛాయలు కనిపించుచున్నవి - వారిలో హార్డీ పోకడలు డికెన్సు శైలి ప్రతిబింబించుచున్నది - అనడం పేరు విమర్శా? కేవలం ఆ విమర్శకుడు తానా అంగ్ల గ్రంథాలు చదివానని చెప్పుకోవడానికి తప్ప వాడి శైలి పీడిలో కనిపించడమేమిటి - ఒకవేళ కనిపించింది పో - వెంకట్రామయ్యగారి భావావేశంలాంటిదే అయిదు వందల ఏళ్ళకు ముందు షేక్స్పియరుకు వచ్చింది కాబట్టి షేక్స్పియరు కూడా అగ్రశ్రేణి రచయితే అనుకోమను. "నాకెందుకీ భావదాస్యం"-

అన్నాడు తాయారూ అని నవ్వాడు శ్రీనాథుడు.

"ఇంతకీ అసలు తమాషా ఏమిటంటే ఆ విమర్శ నేనే వ్రాశాను - అది తెలుసో తెలియదో వెంకట్రామయ్యకు" - మళ్ళీ నవ్వాడు శ్రీనాథుడు.

పూర్వం శ్రీనాథుడు ఇలా నవ్వేవాడుకాదు.

మరొక రచయితను విమర్శించేవాడేకాదు. విమర్శించినా అసత్యమూ అప్రియమూ రెండూ లేకుండా విమర్శించేవాడు బహిరంగంగానే.

కాని ఇప్పుడు తోటి కవులనూ రచయితలనూ విమర్శిస్తున్నాడు - తాను మాత్రం రచనలు చేయడం విరమించాడు ఏవో కొన్ని పెళ్ళిపద్యాలు తప్ప.

"తెలుగువాడు విమర్శను భరించలేకపోతున్నాడు తాయారూ-" అని మళ్ళీ ఓ పరిహాస సూచనమైన నవ్వు నవ్వాడు

ఆ నవ్వు స్ఫటికంలా లేదు-

స్వర్గంలా లేదు-

వెన్నెలలా లేదు.

వెన్నలాలేదు
విరజాజిలా లేదు-
ప్రెస్ చక్రాలనుండి వచ్చే గరగరలా రవరవలా వుంది.

x x x

ఏప్రిల్ నెల.

పొలం మక్తాలు వసూలుచేసుకోని మిగిలిన బాగోగులు విచారించడానికై ఓ వారం రోజులు ఈమనిలోనే నిష్ఠ వేయవలసివచ్చింది శ్రీనాథుడికి.

నీటిలోనుండి బయటపడేసిన చేపలా గిలగిలలాడాడు, ఈమనిలో అన్నాళ్లు ఉండిపోవడానికి.

"అందరూ దొంగవెధవలు - ఉంటేనే పని అంతంతమాత్రం - ఇక కను మరుగైతేనా ప్రెస్సు మొత్తం తినేస్తారు-మామిడి టొక్కలా పీల్చేస్తారు."

"టొక్కలా పీల్చడమేమిటి? పండులా పీలుస్తారు-అంటే మీ ప్రెస్సు తియ్య మామిడి అని అర్థం."

"ఏదోలో ఓ ముష్టి ఉపమానం-నువ్వు మరీనూ తాయారూ,ఒకవైపు నేను నష్టం వస్తున్నదని అల్లాడుతుంటే."

తాయారు భర్తముఖం చూచి ఆశ్చర్యపోతూ అన్నది-

"మీరు చాలా మారిపోయారండీ "

"మార్పు ప్రకృతి లక్షణం - వెదురుబొంగులు చూడు న్యూస్ ప్రింట్గా మారిపోవడంలేదూ - అలాగే."

తాయారు మరేమీ మాట్లాడలేదు-

పూర్వమయితే "వెదురుబొంగు వంశిగామారి సుస్వరాలు పలికిస్తున్న" దనేవాడు.

ఈమనిలో పాలూ పెరుగూ సమృద్ధిగా దొరుకుతాయి - మురికికాలువల వాసన వుండదు.

నిరంతరమైన రద్దీ - హడావుడి - నగర జీవిత ఫలితంగా ఆవిర్భవించే నిరాశా నిస్పృహ ఇక్కడ కనపడవు - తాయారు కాకరకాయలు తరుగుతున్నది.

"పోస్టుమాన్."

తెనాలినుండి రిడైరెక్ట్ అయిన ఉత్తరాలు వచ్చాయి శ్రీనాథుడికి.

అవి చదువుతూ తల పట్టుకొని కూర్చున్నాడు.

"ఏమండీ."

"ఆఁ-"

"ఎలా చేయమంటారు కూర?"

"నీ మొఖంలా చేయి- ముష్టి కూర వండడానికి ముప్పై మూడు ఎంక్వైరీలు - ఇవతల ప్రాణాలమీదికి వస్తుంటే-"

"అదికాదండీ- మీకేది రుచో తెలుసుకుందామని-"

"నాకు ఉప్పు కషాయం రుచి తెలిసిందా - నోరు మూసుకొని ఏదో వండి పారెయ్- కూరలో బెల్లం వేయాలా, వెల్లుల్లి వేయాలా అన్నదాన్ని నీవో ఇంటర్నేషనల్ సమస్యలాచేసి వర్ణిస్తావు నేనేం తిండిపోతును కాను."

తయారు నిశ్చేష్టురాలైంది-

తిరగమోతకు వేసే కరివేపాకు మొక్క సౌందర్యం లాలిత్యం దగ్గరి నుంచీ శ్రద్ధ తీసుకున్న శ్రీనాథుడేనా ఈ శ్రీనాథుడు??

తాయారు వంట చేసింది-

శ్రీనాథుడే వో అర్జంటు ఉత్తరాలు వ్రాశాడు-

వంట ముగించి భోజనానికి పిలిచింది-

"నీవు కానియ్-నాకింకా ఆలస్యం వుంది"

"బాగుంది సరసం- మీరు తినకుండా నేనెన్నడైనా తిన్నానా?"

"పతివ్రతా! అలాగే ఉండు మరో గంట."

సరిగ్గా మరో గంటసేపు బిజినెస్ లెటర్స్ వ్రాశాడు- ఆపైన ఓ రెండు చెంబుల నీళ్లతో నెత్తి తడుపుకోని వచ్చి అన్నం ముందు కూర్చున్నాడు.

"అనుష్ఠానం-"

"నా బతుక్కు అదొక్కటే తక్కువిప్పుడు- అవతల చూడు ఆ గాడిద కొడుకు, టెక్స్టుబుక్ అచ్చు వేయించుకుపోయి అది సెలక్టు కాలేదు కాబట్టి డబ్బు ఇవ్వలేనంటున్నాడు. ఎక్కడుంది న్యాయం ఈ లోకంలో - వాడి బుక్కు సెలక్టు కాకపోవడం నా తప్పా? వాడేగంగలో దూకితే నాకేం, ఇవతల నా శ్రమంతా ఏంకావాలి? కంపోజిర్లకు నేనిచ్చే చార్జీలేమైనా తగ్గుతాయనుకున్నాడా దొంగలం- వెధవ.... ఇటు కొంచెం అన్నం వెయ్-"

"కూర కొంచెం వేస్తాను."

"అక్కర్లేదు అవతల బస్సుకు వేళ అవుతున్నది. వాణ్ణి కోర్టుకీడుస్తాను ఏమనుకున్నాడో - శ్రీనాథుడి సొమ్ము ఎగేసినవాడెవడూ బాగుపడలేదు వంశనాశనమౌతుంది వాడికి, ఏ దొంగ లం........"

"అబ్బబ్బ - ఏం తిట్లండీ అవీ - వినలేకుంచా వున్నాను."

"అవును మరి చిలకలకొలికివి - నీకు వాణి వీణలూ శారికల పలుకులూ కావాలి - అటు రోమ్ నగరం తగలబడుతుంటే నీరోటివాడే నీరో అని ఒకడు ఫిడేలు వాయించుకుంటూ కూర్చున్నాట్ట - నా తిట్లు నీకు బాగాలేదు కాని వాడు చేసిన పని బాగుందా?"

చెయ్యి కడుక్కోని లేచాడు.

"మలక్కాయల సాంబారు వేసుకోలేదు - పెరుగు మామిడిపండ్లూ తిననేదు."

"మీరిద్దరు వున్నారుగా తినండి ."

ఓ పాతచొక్కా తగిలించుకొని జోళ్లూ సంచీ ఉత్తరాలూ పట్టుకొని పరు గెత్తాడు పాటి వైపుకు బస్సు శబ్దంవిని. తాయారు నిశ్చేష్టురాలైంది.

"అమ్మా ఆకలి" అని వచ్చిన ముద్దుకృష్ణకు తిండిపెట్టి అలాగే కూర్చొని ఆలోచించడం మొదలు పెట్టింది. గతం ఆమె కళ్ళముందు రంగుల చిత్రంలా కన్పడింది.

ఈ ఇంట్లోనేనా లోకోన్నత కవిత్వం పండించాడు తన భర్త. ఇక్కడే కదూ తన్ను నీలిసరస్సులో తిరిగే రాజహంస అన్నాడు. నీలాకాశంలో విహ రించే రాజహంస లాంటి చందమామలా వున్నావన్నాడు తనను.

పాలసంద్రంలో నుండి వచ్చిన జగన్మోహినినన్నాడు.

పచ్చపొలాల చీరెను కట్టుకున్న 'భూదేవి' వన్నాడు తవ చిలకపట్టు చీరను చూచి.

ఇవ్వాళ తనకు ఆనాడు లేని డబ్బు వుంది.

ఆనాటికంటే ఎక్కువ వస్తువులున్నాయి.

తామంటే ఇప్పుడు పేరిందేవికి భయం, గౌరవం, భక్తి, వైదేహికీ లక్ష్మణమూర్తికీ తమ సంపాదన చూసి హడల్.

కాని -

కాని తనను భర్త పూర్వంలా అదరంగా వర్ణించడెందువల్ల ?

జీవితాన్ని ఒక రంగవల్లిగా తీర్చిదిద్దుకోవడంలేదెందుకని ? ?

'ఎందుకింత శ్రమ. ఆ పాడు డబ్బుకోసమేనా' అంటే. 'తాయారూ ! డబ్బు విలువ తెలియక అలా అంటున్నావు. పాడు డబ్బుట - పాడుడబ్బు.

కొడుకు నా రికరింగ్ డిపాజిట్‌కన్నా వేగంగా ఎదుగుతున్నాడు, వాడికిరాబోయే అవసరాల స్థాయిలో నా ఆదాయం పెరగడం లేదు. నోరు మూసుకొని అవాకు నాలు పలకకు.

ఒక్కసారి బస్టీకి వెళ్ళి చూడు . ఉదయం ఏడులోగా తిండి తిని టిఫిను భరిణలు చేతపట్టుకొని అర్థరాత్రి వరకూ వనిచేయడానికి మనుషులెలా బస్సులకు ఎగబడుతున్నారో ? వారితో పోలిస్తే నాదీ ఒక శ్రమేనంటావా?" అని వాదిస్తాడు. శ్రీనాథుడు ఇప్పటిదాక డబ్బును ముద్రించే యంత్రం !!

ఇప్పుడాయనకు దొరువుకుపోవాలనే కోరిక లేదు.

తోటలూ చెట్లూ చూడాలనే వాంఛలేదు - అర్థ్రంలేదు. ఉష వింతగా తోచడంలేదు.

"సూర్యగోళం చుట్టూ భూమి తిరగడంవల్ల ఇలా వెలుగు నీడలువస్తాయి. రాకేంజేస్తాయీ ? ఛస్తాయా ?" అంటున్నాడు.

'కోయిలలు కూస్తే గొంగళీలు తిని గొంతు దురదపుట్టి అరుస్తాయట తాయారూ - మనం అనుకునేటట్లు చిగురుటాకులు తిని కాదట'' అని ప్రకృతి శాస్త్ర విజ్ఞానం పుస్తకాన్ని ఇటీవలే అచ్చు వేసిన తన పాండిత్యాన్ని ప్రదర్శిస్తాడు ...తాయారుకు తిండి సయించలేదు.

చేయి కడుక్కొని అలా యాంత్రికంగా లేచి వెళ్ళి పక్కపై పడుకుంది. తాను కోల్పోయిందేమిటో గ్రహించింది - తాను కోరుకున్నధనమయితే వచ్చింది. కాని ...

కోరుకోకుండా ఈశ్వరుడు ప్రసాదించిన రసవాహిని మాత్రం తమ బతుకుల్లో ఇంకిపోయింది - కళ కరువౌతున్నది

ప్రెస్సు శబ్దాల మధ్య రేయింబవళ్ళు నలిగిపోయిన ఆర్త హృదయం ఇప్పుడు హేమంతంలోని కమలంగా విశ్లథమైంది.

రేకులు రాలిపోయాయి.

తాయారులో అసంతృప్తి తెరలు తెరలుగా జారింది.

అలలు అలలుగా లేచింది.

సైరన్‌లా ఘూర్ణిల్లుతున్నది.

బాగా పొద్దుపోయి వచ్చాడు శ్రీనాథుడు ఎండిన గోగుకాడలా వాడిపోయి. ఆయన ముఖంలో ద్వేషమూ నిరాశా బాధా గూడుకట్టుకొని వున్నాయి.

రాగానే తాయారు ఆదరంగా దగ్గరికి వెళ్ళి "లెండి - స్నానం చేసి భోంచేద్దురు -" అంది.

"అక్కర్లేదు - తెనాలిలోనే ఏ హోటల్‌లోనో నాలుగు మెతుకు గతికి వచ్చాను -" అంటూ మంచం పైకి జారిగిలపడ్డాడు -

పుచ్చపువ్వులాంటి వెన్నెల -

దూరంగా కోయిల కూతలు .

ఆకుతోటల మీదుగా తిరిగిన చల్లని సమీరాలు తాయారులో ఆవావేశం ఉవ్వెత్తున లేచింది -

పాల వెన్నెలను కళ్ళతో తాగుతూ అలాగే పడుకున్నది -

పక్కనే వెన్నముద్దలా ముద్దుకృష్ణ -

అలా ఎంత పొద్దుపోయిందో ఏమో మరి -

శ్రీనాథుడు అరుస్తూ లేచాడు ! "దొంగ రాస్కెల్ - పుండాకోర్ - పాప మని దయతో ఉద్యోగమిస్తే బైపు దొంగిలిస్తావా గాడిద కొడకా."

"ఏమండీ - ఏమండీ" తాయారు ఉలిక్కి పడింది. శ్రీనాథుడు లేచాడు - అతని కల చెదిరిపోయింది -

కళ్ళు నులుముకొని చుట్టూ చూచి నిట్టూర్చి "తాయారూ ఓ గ్లాసు నీళ్ళియ్యి" అన్నాడు.

తాయారు నీళ్ళిచ్చింది -

తాగుతూ అన్నాడు 'కల చెదిరినట్లుంది - నిద్రలో మెలకువ వచ్చింది -'

"కల చెదిరింది మీకే కాదండీ నాకు కూడాను - దేవుడిచ్చిన తియ్యటి కలను కరిగించుకున్నాను"

అయోమయంగా చూచాడు శ్రీనాథుడు.

"ఏమండీ మనకా ప్రెస్ వద్దు మీకీ చిత్తక్షోభవద్దు - అమ్మేద్దామా ?"

శ్రీనాథుడు విషాదంగా నవ్వాడు. కొన్ని క్షణాలాగి అన్నాడు 'ప్రెస్సు లేకుంటే పెరిగే పిల్లాడి అవసరాలమాటేమిటి ? పైగా ప్రెస్సుపోయినా పూర్వపు శ్రీనాథుడు నీకు కన్పడడు. రసవాహినిని ఎండించడమయితే మనం చేశాము కాని తిరిగి దానిని జీవనగంగగా ప్రవహింపజేయడం మాత్రం నాకు సాధ్యంకాని

విషయం. ఈ ఇంద్రధనుస్సులు నన్ను పలకరించవు. చంద్రతాపాలు నన్ను పులకరింపజేయవు తాయారూ కరిగించజాలవు."

ఎందుకో తాయారు గొంతు గాద్గదికమైంది.

ఆమెకు తాను పోగొట్టుకున్న దేమిటో అర్థమైంది. తిరిగి సంపాదించుకో లేనిదేమిటో కూడా తెలిసిపోయింది.

ముద్దుకృష్ణ ఇటు నుండి అటు వైపు పొర్లాడు. శ్రీనాథుడు మళ్ళీ పడు కున్నాడు కాని నిద్ర పట్టలేదు. ఆయన మనస్సులో ప్రెస్ తాండవమాడు తోంది.

"ధన ధన ధన ధన ధన ధన -" శబ్దాలు, ధ్వనులు, మోతలు, అరుపులు.

''ఏమండీ - ఈ వెన్నెలలో మన బాబు ఎలా వున్నాడో అలంకారికంగా చెప్పండి ''

''చెప్పేందుకు ఏ ముష్టి వెధవ ఉపమానమూ నా దగ్గరలేదు తాయారూ!"